


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 154 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 మంగళవారం 02 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్



1959 - 2024
దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్



మిగతా 2 లో

# హరీష్ రావు, సంతోష్‌లపై కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పక్కనున్న కొందరు చేసిన పని వల్లే ఆయనకు చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.కెసిఆర్‌ను బద్నాం చేసే పనిలో హరీష్ రావు, సంతోష్‌ల పాత్ర ఉందని, వారి వెనక సిఎం రేవంత్ రెడ్డి ప్రోద్బలం ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందులో ఐదేళ్లపాటు ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు పాత్ర లేదా అని సూటిగా ప్రశ్నించారు. మాజీ ఎంపీ సంతోష్, హరీశ్‌రావు వల్లే కేసీఆర్‌కు చెడ్డపేరు వచ్చిందన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. కాళేశ్వరంలో చిన్నభాగం కుంగితే మొత్తం ప్రాజెక్టు పోయినట్లు- రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ జనం కోసం పని చేస్తే.. వాళ్లు ఆస్తుల పెంపుకోసం పని చేశారు. హరీశ్‌రావు, సంతోష్ నాపై ఎన్నో సార్లు కుట్రలు చేశారు. అయినా నేను నోరు మెదపలేదు. ఈ రోజు కేసీఆర్ బిడ్డగా నేను ఎంతో బాధపడుతున్నా. హరీశ్‌రావు, సంతోష్ వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారు. వారి మధ్య లోపాయకారి ఒప్పందం కుదిరింది. హరీశ్‌రావు, సంతోష్‌ను రేవంత్ రెడ్డి ఏమీ అనరు. నా తండ్రిపైనే బాణం వేస్తారు. కేసీఆర్ మీద సీబీఐ దర్యాప్తు వేశాక పార్టీ ఉంటే ఏంటి?




# మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

**మహిళా సంఘాలకే చేప పిల్లల పెంపకం బాధ్యతలు**

**మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్ లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల వారు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే పరిస్థితిని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువులు చేప పిల్లల పెంపకానికి 122 కోట్లు- విడుదల చేశామని డిప్యూటీ- సీఎం తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగిస్తామని ప్రభుత్వం ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారి తో సోలార్ పవర్ ఎ÷-లాంట్ లు ఏర్పాటు- చేయించి ప్రభుత్వమే వారి నుంచి విద్యుత్ కొనుగోలు చేసి ఆదాయం సమకూర్చే కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో మహిళల చేత పెద్ద ఎత్తున వ్యాపారం చేయించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు.



మిగతా 2 లో

**తియాన్‌జిన్ వేదికగా షాంఘై సహకార సదస్సు**

# పుతిన్ మోడీ పరస్పర ఆలింగనం

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

చైనాలోని తియాన్‌జిన్ వేదికగా షాంఘై సహకార సంస్థ 25వ శిఖరాగ్ర సదస్సు సోమవారం అధికారికంగా ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. ఈసందర్భంగా సదస్సుప్రారంభ సమయంలో పుతిన్‌ను ప్రధాని మోదీ ఆత్మీయంగా పలకించారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆలింగనం చేసుకున్నారు.

**అఫ్గానిస్థాన్‌లో**

# భారీ భూకంపం

**-విపత్తు కారణంగా 622 మంది మృత్యువాత-మరో 1500 మంది వరకు క్షతగాత్రులు**

**కాబూల్,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

అఫ్గానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. పాకిస్థాన్ సరిహద్దులోని కునార్ ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేల్‌పై 6.0 తీవ్రత నమోదైంది. ఈ ఘోర విపత్తు కారణంగా 622 మంది మరణించినట్లు- ఆ దేశ అధికారిక మీడియా సంస్థ రేడియో టెలి విజన్ అఫ్గానిస్థాన్ వెల్లడించింది. మరో 1500 మంది వరకు గాయపడినట్లు- తెలిపింది. యూఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. నంగర్హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు- వెల్లడైంది.



మిగతా 2 లో

**తెలుగువాడిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బలపర్చాలి**

**ఆత్మప్రబోధానుసారం ఓటేయండి**

# చంద్రబాబు, జగన్, పవన్‌లకు సిఎం రేవంత్ పిలుపు

**హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని చెప్పారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో కలిసి సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్‌ల్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్డీయే అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ.. తెలుగువాడికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీఎంలు కేసీఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అక్బరుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా.



మిగతా 2 లో



# ఓట్ చోరీపై హైడ్రోజన్ బాంబు పేలుస్తా

**పాట్నాలో ఓటర్ అధికార్ యాత్ర ముగింపు**

**మరోమారు మోడీపై రాహుల్ విమర్శలు**

**పాట్నా,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

ఓట్ల చోరీ విషయంలో ఇటీవల అణుబాంబు పేల్చామని.. త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దీని తర్వాత ప్రధాని మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారన్నారు. 'ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు భాజపాకు అనుమతించబోం. అందుకే ఈ యాత్ర నిర్వహించాం. దీనికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. మహారాష్ట్రలో, కర్ణాటకలో ఓట్ల చోరీ జరిగిందని ఆధారాలు సహా చూపించాం. ఓట్ల చోరీ అంటే.. హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అన్నట్లే.

# హైకోర్టులో మరోమారు కెసిఆర్‌కు చుక్కెదురు

**సిబిఐ విచారణ జరపకుండా ఆపలేమన్న కోర్టు**

**హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):**



మిగతా 2 లో

హైకోర్టులో కెసిఆర్,హరీష్ రావులకు మరోమారు చుక్కెదురయ్యింది.కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఆపాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమని తెలంగాణ హైకోర్టు తెలిపింది. కాళేశ్వరం నివేదికపై హైకోర్టులో కేసీఆర్, హరీశ్ మరోసారి మెన్షన్ చేశారు . కాళేశ్వరంపై విచారణను సీబీఐకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని.... రేపటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని పిటిషన్ లో తెలిపారు హరీశ్ తరపు న్యాయవాదులు. ఈ పిటిషన్ ను అత్యవసరంగా విచారించాలని కోరారు. ఈ సందర్భంగా విచారణ జరిపిన హైకోర్టు హరీశ్ పిటిషన్ పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. సీబీఐ విచారణను ఆపాలంటూ ప్రభుత్వాన్ని తాము ఆదేశించలేమని తెలిపింది. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమంది. తదుపరి విచారణను సెప్టెంబర్ 2కి వాయిదా వేసింది. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వైరీ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికలపై కసరత్తు

**8న ఎన్‌డిఎ ఎంపిలకు ప్రధాని విందు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1(సమయజ్యోతి):**

ఉపరాష్ట్రపతి ఎన్నికకు మరికొద్ది రోజులు మాత్రమే ఉండటంతో తమ అభ్యర్థి గెలుపు కోసం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే తుది వ్యూహానికి కసరత్తు చేస్తోంది. కూటమికి చెందిన 425 మంది ఎంపీలు హాజరై 100 శాతం ఓటింగ్ జరిగేలా చూసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతి రాష్ట్రం నుంచి ఎన్డీయే ఎంపీలు తమ ఓటు- హక్కు వినియోగించుకునేందుకు ఢిల్లీకి తీసుకు వచ్చే బాధ్యతను పలువురు మంత్రులు, ఎంపీలపై ఉంచినట్టు- పార్టీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుండగా దీనికి ఒకరోజు ముందు సెప్టెంబర్ 8న ఎన్డీయే ఎంపీలందరికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిన్నర్ ఇవ్వనున్నారు. ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కోసం ఎంపీలందరికీ మూడు రోజుల పాటు- వర్క్‌షాప్‌ను ఎన్డీయే కూటమి నిర్వహించనుంది.

మొదటిపేజీ తరువాయి

## హరీష్ రావు, సంతోష్‌లపై కవిత సంచలన వ్యాఖ్యలు

లేకపోతే ఏంటి? ఇది నా తండ్రి పరువునకు సంబంధించింది. నా లేఖ బయటకు వచ్చినా నేను ఎవరి పేర్లు బయటపెట్టలేదు. రేవంత్‌రెడ్డి ప్రీ-ప్లాన్‌డ్‌గా సీబీఐ దర్యాప్తుకు ఆదేశించారని అన్నారు. కేసీఆర్ హిమాలయ పర్వతం లాంటి వారు. ఆయనకు అవినీతి మరక అంటితే బాధగా ఉంది. నాకు పెళ్లి చేసేందుకు కూడా మా నాన్న ఆర్థిక ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి నా తండ్రిపై సీబీఐ దర్యాప్తుకు ఆదేశిస్తే నాకు బాధగా ఉండదా? కేసీఆర్‌ని నిన్న అన్ని మాటలు అంటుంటే, ఒక్కరు కూడా నోరు విప్పకపోవడం ఏంటి? రేవంత్.. మీకు దమ్ముంటే.. లోపాయకారీ ఒప్పందం లేకపోతే నేను పేర్లు కూడా చెప్పా.. చర్యలు తీసుకోండని సవాల్ చేశారు. ఆ ఇద్దరు, ముగ్గురు నేతలే కేసీఆర్‌పై కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీష్‌రావు, సంతోష్‌ది కీలకపాత్ర అని వెల్లడించారు. వీరిద్దరి వెనక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని.. వారిని కాపాడుతున్నారని ఆరోపించారు. నేనిప్పుడు మాట్లాడితే నా వెనుక ఎవరో ఉన్నారంటారని.. కానీ, అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు బాధ్యుణ్ణి చేస్తూ రేవంత్ ప్రభుత్వం మా నాన్నపై సీబీఐ విచారణ వేసింది. నా కడుపు మండిపోతోంది. మా నాన్నకు డబ్బు, తిండిపై ఏనాడూ యావ లేదు. మా నాన్న పరువు పోతే మాకు బాధ.. వాళ్లకు ఏం లేదు. కాళేశ్వరం అవినీతిలో హరీష్‌రావుది మేజర్ పాత్ర. అందుకే హరీష్‌రావును ఇరిగేషన్ మంత్రిగా తొలగించారు. హరీష్‌రావు, సంతోష్‌రావు వల్లే కేసీఆర్‌కు ఈ పరిస్థితి దాపురించింది. కేసీఆర్‌ను అడ్డుపెట్టుకుని హరీష్, సంతోష్ భారీగా ఆస్తులు కూడబెట్టారు. హరీష్‌రావు, సంతోష్‌రావుకు డబ్బు మాత్రమే కావాలి. అవినీతి అనకొండల మధ్య కేసీఆర్ బలిపశువు అవుతున్నారని మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత కంటతడి పెట్టుకున్నారు. బీసీల రిజర్వేషన్లపైనా బిల్ పెడతారు. కానీ, ఎందుకు సుప్రీం కోర్టు దాకా వెళ్లి పోరాడటం లేదు. బిహార్ కోసం తెలంగాణ బీసీ బిడ్డలను రేవంత్ బలి చేస్తున్నారు. తెలంగాణ జాగృతి నుంచి బిహార్ వెళ్లి మీ బండారం బయటపెడతాం. సీబీఐ కాదు, ఇంకే విచారణ వేసినా కేసీఆర్ కడిగిన ముత్యంలా వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

## భారీ భూకంపం

8 కిలోమీటర్ల లోతులో అది కేంద్రీకృతమై ఉంది. ఆదివారం అర్ధరాత్రి 11.47 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించినట్లు- అధికారులు తెలిపారు. ఘోర విపత్తు కారణంగా కునార్ ప్రావిన్స్ తీవ్రంగా ప్రభావితమైనట్లు- సమాచారం. భూకంప తీవ్రతకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితులకు అత్యవసర సహాయం అవసరమని పలువురు పోస్టులు పెడుతున్నారు. భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని వార్దక్ ప్రావిన్స్ మాజీ మేయర్ జరీఫా ఘఫ్పారీ పోస్టు పెట్టారు. ఈ విపత్తు ధాటికి పలు కుటుంబాలు కకావికలమైనట్లు పేర్కొన్నారు. 'అఫ్గానిస్థాన్‌లోని కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రావిన్స్‌లు భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇళ్లు కూలిపోవడంతో పలు కుటు-ంబాలు వీధిన పడ్డాయి. వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర గాయాలపాలై ఇక్కట్లు- ఎదుర్కొంటు-న్నారు. బాధితుల పరిస్థితి దుర్భరంగా ఉంది. అసమర్థ తాలిబన్ ప్రభుత్వం ఈ విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా లేదు. ఈ సమయంలో కునార్ ప్రజలకు సాయం అత్యవసరం. అంతర్జాతీయ సమాజం, మానవతా సంస్థలు సత్వరమే స్పందించి బాధితులను ఆదుకోవాలి. అవసరమైన ఆహారం అందించి.. ఆశ్రయం కల్పించాలి. ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి' అని పోస్టులో పేర్కొన్నారు. భూకంపం కారణంగా పలువురు మరణించారనే వార్త విని తాను చలించిపోయానని క్రికెటర్ రహ్మానుల్లా గుర్బాజ్ పోస్టు పెట్టారు. బాధితుల కుటు-ంబం కోసం ప్రార్థిస్తున్నట్లు- చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులు సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని అంతకుముందు ఓ అధికారి తెలిపారు. 20 నిమిషాల వ్యవధి తర్వాత 4.5 తీవ్రతతో మరో భూకంపం వచ్చినట్లు- పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## మహిళల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్

ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీ-శ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించి మొదటి సంవత్సరంలో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 21,600 కోట్లు- వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్టు- తెలిపారు. హై-టె-క్ సిటీ- పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా వారిని ప్రోత్సహిస్తుందని డిప్యూటీ- సీఎం తెలిపారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లో ఏర్పాటు- ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంతో పోటీ- పడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారు ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు- తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుంది అన్నారు. ?కార్యక్రమంలో క్రీడలు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు- సాయికుమార్, ఊ÷ూ సీఈఓ దివ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## పుతిన్ మోడీ పరస్పర ఆలింగనం

ఆ చిత్రాలను మోదీతన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పుతిన్‌ను కలవడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుందని రాసుకొచ్చారు. ఇక, జిన్‌పింగ్, పుతిన్ తో సంభాషించిన చిత్రాలను కూడా పంచుకున్నారు. 'తియాన్‌జిన్‌లో చర్చలు కొనసాగుతున్నాయి' అని పేర్కొన్నారు. షాంఘై శిఖరాగ్ర సదస్సును చైనా అధ్యక్షుడు ప్రారంభించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సదస్సు అనుబంధంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ ద్వైపాక్షికంగా సమావేశం కానున్నారు. రష్యా చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలు, ఉక్రెయిన్‌పై మాస్కో యుద్ధం వంటి పరిణామాల వేళ వీరి భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టారిఫ్‌ల అంశంపై వీరిద్దరూ చర్చించుకునే అవకాశం ఉంది. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై సుంకాలను అమెరికా 50శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఆగస్టు 27 నుంచి ఈ టారిఫ్‌లు అమల్లోకి వచ్చాయి. భారత్‌కు చమురును విక్రయించిన సొమ్ముతో రష్యా యుద్ధం కొనసాగిస్తోందని, దీన్ని ఆపాలని ట్రంప్ ఆరోపించారు. దీన్ని భారత్ ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూనే ఉంది.

మొదటిపేజీ తరువాయి

# హైడ్రోజన్ బాంబు పేలుస్తా

ఈ వ్యవహారంలో త్వరలోనే హైడ్రోజన్ బాంబు పేల్చనున్నాం అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓటరు అధికార్ యాత్ర' ముగింపు సందర్భంగా 'ఇండియా' కూటమి నేతలు పట్నాలో నిర్వహించిన 'గాంధీ సే అంబేడ్కర్' మార్చ్‌ను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. దీంతో నేతలు అక్కడే ప్రసంగించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఓడిపోతుందన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికల వేళ.. రాహుల్ గాంధీ 'ఓటరు అధికార్ యాత్ర' చేపట్టారు. ఆగస్టు 17న ససారాంలో మొదలైన ఈ యాత్ర.. 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,300 కి.మీ. మేర కొనసాగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' పక్రియ మొదలు మహిళా, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ స్థానికులకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. ఓట్ల దొంగతనం ద్వారానే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాని మోడీ ప్రయత్ని స్తున్నారు. ఓటర్ చోరీ చేసే మోడీ కేవలం భారత్‌కే పరిమితం కాలేదు. ఆయన బీజింగ్‌కు కూడా చేరుకున్నారు. కానీ చైనాలో, అమెరికాలో కానీ.. మోడీని ఓటు దొంగ అని.. సింహాసనాన్ని వదిలేయండి అనే అక్కడి ప్రజలు అంటున్నారు అని రాహుల్ అన్నారు. బీహార్‌లో చేపట్టిన ఎస్‌ఐఆర్ పక్రియపై తాను హైడ్రోజన్ బాంబు పేల్చబోతున్నట్లు- హెచ్చరించారు. మహాత్మాగాంధీని హత్య చేసిన శక్తులే ఇప్పుడు రాజ్యాంగాన్ని హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఏం జరిగినా.. రాజ్యాంగాన్ని హత్య చేయడానికి అనుమతించము. బీహార్ ఒక విప్లవాత్మక రాష్ట్రం. ఇది దేశం మొత్తానికే ఒక సందేశాన్ని పంపింది. మేము ఓటు- దొంగతనం జరగనివ్వము అని రాహుల్ అన్నారు. బీహార్ ప్రజలు తమ ఓటు- హక్కును కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని లేకుంటే.. మోడీ, అమిత్‌షాలు మిమ్మల్ని ముంచేస్తారని ఖర్గే హితవు పలికారు. నేడు ఆయన ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు- చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రధాని మోడీకి దొంగతనం చేసే అలవాటు ఉంది. ఆయన ఓట్లను, డబ్బును దొంగిలిస్తారు. అలాగే దేశంలోని బ్యాంకులను దోచుకున్న తర్వాత భారత్ నుంచి పారిపోయిన వారిని వారు జాగ్రత్తగా చూసుకుంటారని ఆయన అన్నారు. ప్రధాని మోడీ జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీతో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. మీరు అప్రమత్తంగా ఉండండి. మీరు అప్రమత్తంగా లేకపోతే.. మోడీ, అమిత్ షాలు మిమ్మల్ని ముంచేస్తారు అని ఖర్గే అన్నారు. స్వాతంత్యం÷-ర వచ్చిన తర్వాత బాబాసాహెబ్ అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీలు దేశానికి ఓటు- హక్కుని తెచ్చారు. మనం ఆ హక్కును కోల్పోకూడదు. దీనికోసం మనం తీవ్రంగా పోరాడాలి. మన ఓటు- హక్కులకు ఉన్న ముప్పును తొలగించాలి అని ఖర్గే అన్నారు.

మొదటిపేజీ తరువాయి

# కెసిఆర్‌కు చుక్కెదురు

పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ పై ఆదివారం అసెంబ్లీలో 10 గంటల పాటు- సుదీర్ఘ చర్చ అనంతరం సంచలన ప్రకటన చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికలో ఎన్నో విచారణార్హమైన అంశాలు, అంతర్రాష్ట్ర వ్యవహారాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీష్ రావు కాళేశ్వరం నివేదికపై హైకోర్టును ఆశ్రయించారు. ఆదివారం నాడు హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఘోష్ నివేదికను ఆధారంగా చేసుకుని తమపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే, నిన్న విచారణ చేయడానికి కోర్టు నిరాకరించింది. దీంతో సోమవారం అదే బెంచ్‌లో లంచ్ మోషన్ పిటిషన్ వేసి విచారణ జరపాలని కోరారు. కోర్టు లంచ్ మోషన్‌కు కూడా స్వీకరించలేదు. రెగ్యులర్ పిటిషన్లలాగే ఆ పిటిషన్‌ను కూడా విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేస్తామని పేర్కొంది. రేపటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించలేమని, సీబీఐ విచారణ ఆపాలనీ ఆదేశించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా హైకోర్టులో కేసీఆర్ తరఫు న్యాయవాది సుందరం మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని చీఫ్ జస్టిస్ ముందు ప్రస్తావించారు. ఇద్దరినీ ఉరి తీయాలని ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడారని అన్నారు. కేసును సీబీఐకి అప్పగించాలని అసెంబ్లీలో నిర్ణయం జరిగినట్లు- వెల్లడించారు. అందుకే అర్జెంట్‌గా పిటిషన్‌ను విచారించాలని కోరుతున్నామన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా, మంగళవారం నాడు ఈ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

# షాంఘై సదస్సులో అరుదైన ఘట్టం ఒకే కారులో పుతిన్‌తో మోడీ ప్రయాణం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(సమయజ్యోతి): సాధారణంగా పెద్దపెద్ద సదస్సుల్లో దేశాధినేతలు వేర్వేరు కార్ల కాన్వాయ్‌ల్లో వేదికల వద్దకు చేరుకొంటారు. కానీ, తింజియన్‌లోని షాంఘై సహకార సదస్సులో మాత్రం భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ఒకే కారులో బయల్దేరి వేదిక వద్దకు చేరుకోవడం విశేషం. ఈ విషయాన్ని స్వయంగా ప్రధాని ట్విటర్‌లో పంచుకొన్నారు.ఎస్‌సీవో సదస్సు వేదిక వద్ద ప్రొసీడింగ్స్ ముగిసిన తర్వాత.. అధ్యక్షుడు పుతిన్, నేను కలిసి ఒకే కారులో మా ద్వైపాక్షిక భేటీ- వేదిక వద్దకు చేరుకొన్నాం. ఇద్దరి మధ్య చర్చలు ఎప్పుడూ లోతుగా జరుగుతాయని పేర్కొన్నారు. ఇరు దేశాధినేతల మధ్య నెలకొన్న స్నేహబంధానికి ఈ జర్నీ గుర్తుగా నిలిచింది. షాంఘై సహకార సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. దీనిలో ఆయన వాడే ఆరస్ సెనేట్ లిమోసిన్ కూడా ఉంది. దీనికి ప్రత్యేకంగా చైనా డిఎ÷-లొమేటిక్ లైసెన్స్ కేటాయించింది. అమెరికా అధ్యక్షుడు వాడే బీస్ట్‌లా దీనిలో కూడా రష్యా (షశ) అధినేత రక్షణకు చాలా ఫీచర్లను అమర్చారు. ఈ కారు చాలా ఆకర్షణీయంగా రోల్స్ రాయిస్, బెంట్లీ- మోడల్స్‌ను కలిపి తయారుచేసినట్లు అనిపిస్తుంది. అత్యంత విలాసవంతగా ఉన్న ఈ వాహనంలో 4.4లీటర్ వీ8 పెట్రోల్-హైబ్రీడ్ ఇంజిన్ వాడారు. 2018లో పుతిన్ నాలుగోసారి ప్రమాణ స్వీకారం సందర్భంగా ఇది విధుల్లోకి వచ్చింది. ఇది దాదాపు ఏడు టన్నుల బరువు ఉంటుందని సమాచారం. ఇది తూటా, బాంబు దాడులను తట్టుకోగలదు. వీఆర్-10 బాలిస్టిక్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న మెటీరియల్‌తో నిర్మించారు. దీనిలో రసాయన దాడి నుంచి అధ్యక్షుడిని రక్షించేందుకు అన్ని ప్రత్యేక సౌకర్యాలున్నాయి. అదనపు ఆక్సిజన్ అందించేందుకు ఏర్పాట్లు- చేశారు. అగ్ని ప్రమాదాలను నివారించే వ్యవస్థ కూడా దీనిలో ఉంది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికలపై కసరత్తు

మొదటిపేజీ తరువాయి

బ్యాలెట్‌ను కరెక్ట్‌గా మార్క్ చేయడం, ఎన్నికల అధికారికి ఇచ్చే పెన్‌ను తప్పనిసరిగా ఉపయోగించడం, చెల్లని ఓట్లకు అవకాశం ఇవ్వకుండా ఏవిధంగా బ్యాలెట్‌ను సరిగా ఫోల్డ్ చేయాలనే దానిపైన వర్క్‌షాప్‌లో వివరిస్తారు. సీక్రెట్ బ్యాలెట్ ఎన్నిక కావడంతో విప్ అనేది వర్తించదు. ఆ దృష్ట్యా చెల్లని ఓట్లను, క్రాస్ ఓటింగ్‌ను నిరోధించడంపై ఎన్డీయే ప్రధానంగా దృష్టి సారిస్తోంది. తమకున్న 425 ఎంపీల బలానికి తోడు అదనపు మద్దతు పొందేందుకు కూడా కూటమి నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అభ్యర్థి గెలుపునకు అవసరమైన మెజారిటీ- మార్క్ 391 ఓట్లు- కాగా, ఎన్డీయేకు 425 ఓట్ల బలం ఉంది. 11 మంది ఎంపీలున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఎన్డీయేకు మద్దతు ప్రకటించింది. కాగా, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర ప్రస్తుత గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బరిలో ఉండగా, ఆయనపై పోటీ-కి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డిని విపక్ష

## చంద్రబాబు, జగన్, పవన్‌లకు సిఎం రేవంత్ పిలుపు

రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పార్టీలకతీతంగా ఓటె-య్యాలన్నారు. తాజ్ కృష్ణ హోటల్ లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ ,తుమ్మల,పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీ గడ్డం వంశీతో పాటు- పలువురు ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. సుదర్శన్ రెడ్డి పోటీతో ఎన్డీయే కూటమిలో భయం మొదలైందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసమే ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేస్తుందని చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడం కోసం..రద్దు కోసం ఎన్డీయే పోటీ- చేస్తుందని విమర్శించారు. పీవీ, జైపాల్ రెడ్డి జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారని అన్నారు రేవంత్.. సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేశారని చెప్పారు. చంద్రబాబు,కేసీఆర్, జగన్ ,పవన్, అసద్ ఆత్మ ప్రభోదానుసారం ఓటెయ్యాలన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి..అందరం ఏకతాటిపై వచ్చి తెలుగు బిడ్డను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ రెడ్డి గెలుపు దేశ రాజకీయాల్లో మలుపు తిప్పుతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగ, రాజ్యాంగ రక్షణ కోసమే సుదర్శన్ రెడ్డిని నిలబెట్టామన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే దేశాన్ని కాపాడుకోగలమని చెప్పారు.

## అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆదిబట్ల శ్రీ చైతన్య విద్యార్థి బంగారు పతకం సాధించాడు

సమయజ్యోతి, హైదరాబాద్ ఆగస్టు 24, 2025

హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కుంగ్ ఫు అండ్ తైక్వాండో 2025 ఛాంపియన్‌షిప్లో ఆదిబట్ల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి బంగారు పతకాన్ని సాధించి తెలంగాణకు గౌరవం తీసుకువచ్చాడు.ఇంటర్నేషనల్ ఓపెన్ టు స్పోర్ట్స్ ఆల్ స్టైల్ కరాటే, కుంగ్ ఫు, తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ 2025ను బ్రూస్ లీ'స్ జీట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 24న కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, యూసఫ్‌గూడలో నిర్వహించారు. పలు దేశాల నుండి క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు.కఠినమైన పోటీలో, ఆదిబట్ల శ్రీ చైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బి. నితిన్ రెడ్డి ప్రతిభ కనబరిచి, మొదటి బహుమతిని సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు.శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజిఎం సతీష్ ఈ విజయంపై నితిన్ రెడ్డిని అభినందిస్తూ, "మన విద్యాసంస్థకు గర్వకారణమైన ఘనత ఇది. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని తెలిపారు.



# బాసర సరస్వతి దేవస్థానానికి ప్రత్యేక అధికారిగా బైంసా సబ్ కలెక్టర్ నియామకం

సమయజ్యోతి న్యూస్,

నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 01.



బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానానికి గత రెండేళ్లుగా రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లేని నేపథ్యంలో ఆలయ పరిశుభ్రత, నిర్వహణపై ఫిర్యాదులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆలయ వ్యవస్థను బలోపేతం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ ను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సబ్ కలెక్టర్ దేవస్థానం యాజమాన్యంతో సమన్వయం చేస్తూ ఆలయ పరిశుభ్రత, భద్రత, ప్రజా సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్య పండుగలు, భక్తుల రద్దీ సందర్భాలలో జిల్లా కలెక్టర్ ప్రతినిధిగా సమన్వయంతో పనిచేస్తూ ఆలయ పరిపాలనలో అభివృద్ధి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

# లంబాడీల జోలికొస్తే పరువు దావ కేసు జాదవ్ శ్రావణ్ నాయక్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్

జగదాంబ దేవి వారసులుగా సేవాలాల్ ,బంజారా జాతి లంబాడ జాతి గోవులను రక్షించే జాతి సంచార జాతి అయిన బంజారా లంబాడ జాతి, చరిత్ర విప్పి చూసుకో, ఎమ్మెల్యే వెంకట్రావు భద్రాచలం ఆయనకు ప్రతిఘటిస్తామని జాదవ్ శ్రవణ్ నాయక్ హెచ్చరించారు. బ్రిటిష్. బ్రిటిష్ వారికి స్వాతంత్రం కొరకు ముందు అడుగు వేసి స్వతంత్ర సాధ్యంలో తొలి ప్రాధాన్యం ఉన్నటువంటి బంజారా లంబాడాలను ఎమ్మెల్యే వెంకట్రావు భద్రాచలం అలా మాట్లాడడం సబబు కాదని అతనిపై పరువు దావా కేసు వేస్తానని న్యాయవాది జాదవ్ శ్రావణ్ నాయక్ న్యాయవాది హెచ్చరించారు.తొలి దశ తెలంగాణ ఉద్యమంలో విరోచితంగా పోరాడిన ఠను నాయక్ వారసులైన లంబాడీలను గిరిజనుల కాదని అనడం సబాబు కాదని లంబాడి పూర్వీకులు అందరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోని తెలంగాణ వాసు లేనని నిజామునవాబులతో పోరాడిన చరిత్ర లంబాడి వీరులకు ఉన్నదని బంజారా యువజన సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రావణ్ నాయక్ పేర్కొన్నారు ఈ విషయాన్ని లంబాడి ఎమ్మెల్యేలు లంబాడ ఎంపీలు పార్లమెంటు అసెంబ్లీలో చర్చించి ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయవలసిన అవసరం ఉన్నదని ఈరోజున లంబాడి సోదరులపై అనేక రకాలుగా జాతుల మధ్య కుట్రలు జరుగుతున్నదని రాజకీయ కుట్రలో భాగంగా లంబాడా గిరిజనులు బలవుతున్నారని ఈ విషయంని అసెంబ్లీ సాక్షిగా చర్చించాలని ప్రతి లంబాడి గిరిజన సోదరుడు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఉండదు అని ఆయన పిలుపునిచ్చారు ఈ విషయంపై భారత ప్రధానమంత్రిని సుప్రీంకోర్టులో ఆలిండియా బంజారా యువజన సేవా సంఘం తరపున ఫిర్యాదు, తోపాటు పరువు దావ కేసు సుప్రీంకోర్టులో పిటిషన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు



# ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గదికి వెళ్లారు. ఆహార పదార్థాలు సిద్ధం చేస్తుండగా, పరిశీలించారు. అనంతరం 6 నుంచి 10 తరగతి గదుల్లోని విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తుండగా, పరిశీలించారు. 10 వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని సాధన చేయించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఆవరణ అంతా మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు.



# వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్ నీట మునిగిన పంటలు, కొట్టుకుపోయిన రోడ్ల పరిశీలన

సమయజ్యోతి న్యూస్

నిజామాబాద్, సెప్టెంబర్ 01 :



జిల్లాలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాల వల్ల నష్టం వాటిల్లిన బోధన్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. గోదావరి ఉధృతి వల్ల నవీపేట్ మండలం యంచ, అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ తదితర ప్రాంతాల్లో నీట మునిగిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రవాహం దాటికి కొట్టుకుపోయిన పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, ధ్వంసమైన ట్రాన్స్ ఫార్మర్లు తదితర వాటిని పరిశీలించారు. వరద నీటిలో మునిగి ఇసుక మేటలు వేసిన వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలను పరిశీలించారు. కోస్లీ పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని గమనించారు. వరదల వల్ల వాటిల్లిన నష్టం గురించి, ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి బాధిత రైతులు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే, కలెక్టర్లకు పరిస్థితి తీవ్రతను వివరిస్తూ ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బాధిత రైతులు, ప్రజలకు ధైర్యంగా ఉండాలని సూచించారు. వరదల వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో అతి భారీ వర్షాలు కురిసిన కారణంగా శ్రీరాంసాగర్ కు వరద పోటెత్తి గోదావరి పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని అన్నారు. నాలుగు రోజులుగా వరి పైరు, ఇతర పంటలు నీట మునిగి ఉండడం వల్ల చేతికందే పరిస్థితి లేకుండాపోయిందని అన్నారు. సమగ్ర వివరాలతో కూడిన పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని, బాధితులకు పరిహారం అందేలా కృషి చేస్తామని అన్నారు. కాగా, వరదల వల్ల వాటిల్లిన పంట నష్టం వివరాలను ఒక్క ఎకరం కూడా తప్పిపోకుండా పక్కాగా సేకరించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ట్రాన్స్కో అధికారులకు సూచించారు. దెబ్బతిన్న రోడ్లను కూడా వెంటనే మరమ్మతులు చేసి, రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, ప్రజలకు అండగా నిలవాలని హితవు పలికారు. కాగా, వరద తాకిడికి గురైన పంటల విషయంలో వ్యవసాయ అధికారులు అందించే సూచనలను పాటిస్తూ, పంటలను కాపాడుకునే ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రైతులకు సూచించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# ప్రజావాణికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలి

## ఆదేశించిన కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, సెప్టెంబర్ 01 :

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. అత్యవసరమైతే తన అనుమతి తీసుకుని, తమ కింది స్థాయి అధికారిని ప్రజావాణికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని స్పష్టం చేశారు. సోమవారం ఐ.డీ.ఓ.సీలో అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 74 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఎంతో కీలకంగా భావించే ప్రజావాణికి జిల్లా అధికారులు గైర్హాజరు కాకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, మెప్మా పీ.డీ రాజేందర్, ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ బాల్కొండ మండల కేంద్రంలో సోమవారము మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఇన్చార్జి మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రిజర్వేషన్లు బీసీలూ రాజకీయంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వరద బాధితులను ఆదుకోవాలి

## : తాసిల్దార్ కు బిఆర్ఎస్ వినతి

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 01.


బిఆర్ఎస్ పార్టీ నిర్మల్తరుపున పార్టీ నాయకులు తహసీల్దార్ నిర్మల్ అర్బన్ ను కలిసి వినతి పత్రం అందచేసారు.గత కొన్నీ రోజుల నుంచి అతి భారీ వర్షాల వల్ల ఇళ్లు కూలి నవి, ప్రభుత్వం సహాయం కల్పించాలని, దాని గురించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.బిఆర్ఎస్ పార్టీ జిల్లా సెక్రటరీ గంద్రత్ రమేష్, ఖాజా అక్రమ్ అలీ, షైక్ మహేబూబ్, మొహమ్మద్ నయీమ్, మాసూద్ అలీ ఖాన్, మొహమ్మద్ ఫహీం, మహిమూద్, తదితరులు ఇందులో పాల్గొన్నారు,




# తాసిల్దార్ శ్రీనివాస్ కు సన్మానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ తాసిల్దార్ ఆర్.శ్రీనివాసును సోమవారం మండల బిజెపి అధ్యక్షులు అంబటి నవీన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తాసిల్దార్ కు లేఖా ప్రతిని అందజేత

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖా ప్రతిని సోమవారం బాల్కొండ తాసిల్దార్ శ్రీనివాస్ కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# అవినీతి నిర్ణయాలపై నిగ్గు తేల్చాల్సిందే !

కాళేశ్వరం బ్యారేజీల్లో అక్రమాలు, వైఫల్యాలపై మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి సీబీఐకి కేసు అప్పగించాలని శాసనసభ నిర్ణయించడం ఆహ్వానించదగ్గ విషయం. ఓరకంగా ఇది 20 నెలల క్రితమే నిర్ణయం తీసుకోవాల్సిన విషయం. ఆలస్యంగా అయినా అవినీతిపై చర్యలకు సర్కార్ పూనుకుంది. నిజానికి సిబిఐపైన కూడా విశ్వాసం సన్నగిల్లుతోంది. ఏ కేసులోనూ నిక్కచ్చిగా విచారణ చేయలేకపోతోంది. ఎపిలో వైఎస్ వివేకా హత్య కేసును ఐదేళ్లు దర్యాప్తుచేసినా తేల్చలేకపోయింది. జగన్ అవినీతి వ్యవహారాల్లో కూడా విచారణ జరగాలి. నిజానికి రాష్ట్ర విబజన తరవాత తెలంగాణ, ఎపిలుఎందుకు అప్పుల్లో కూరుకు పోయాయో, అందుకు ఏయే నిర్ణయాలు అక్రమమో తేల్చి ఆనా టి పాలకులపై ప్రత్యేక విచారణ కమిషన్‌లు వేయాలి. జగన్, కెసిఆర్ పాలనపై సమగ్ర దర్యాప్తు జరిపి, భవిష్యత్‌లో ఇలాంటి పాలకులు రాకుండా ఉండేలా కఠిన చర్యలకు పూనుకోవాలి. మరోవైపు సిబిఐ వ్యవహా రాల్లో కేంద్రం తలదూర్చడం వల్ల కూడా దాని ప్రతిష్ట మంటకలుస్తోంది. ఇకపోతే రాజకీయ అవినీతి కేసుల విచారణకు సిబిఐ విచారణలు సరిపోవు. లోక్‌పాల్ వ్యవస్థ రావాల్సి ఉంది. దేశంలో రాజకీయ అవినీతి బాగా వేళ్లూను కుంది.రాజకీయ నాయకులు పాలనను పక్కన పెట్టి అవినీతిలో మునిగి తేలుతున్నారు. ఇందుకోసం స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఉండాల్సిందే. మోడీ ప్రభుత్వం ఈ విషయంలో నిబద్ధతను చాటుకుని సర్వ స్వతంత్ర న్యాయవ్యవస్తకు శ్రీకారం చుట్టాలి. కేవలం రాజకీయ అవినీతిని విచారిం చేందుకు దీని అవసరం చాలావుంది. ఇకపోతే కాళేశ్వరం నిర్మాణమే పెద్ద డొల్ల. అదికేవలం కమిషన్ల కోసం, కెసిఆర్ తన ఎర్రవల్లి పొలం పారించుకునేందుకు కట్టిన కట్టడం తప్ప ప్రజలకు ఉపయోగపడే కట్టడం కాదు. నిపుణుల సూచనలు బేఖాతర్ చేస్తూ కట్టిన కట్టడం అది. అది అవినీతి కట్టడం కాకుంటే...కెసిఆర్ నిజాయితీ పరుడైతే కాళ్వేరం కమిషన్‌ను వ్యతిరేకించరు. హైకోర్టుకు వెళ్లి కమిషన్‌ను రద్దు చేయమని కోరరు. ఆందోళనలు చేయాలని పిలుపునివవ్వరు. దాదాపు పదేళ్లు పాలించిన కెసిఆర్ కుటుంబం తెలంగాణను అప్పులకుప్పగా చేసి కుటుంబపాలనతో భ్రష్టు పట్టించింది. ఈ క్రమంలో దీనిపై సిబిఐ విచారణను స్వాగతించాల్సిన అవసరం ఉంది. ఆదివారం శాసనసభలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించడం మంచి నిర్ణయంగా చూడాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆర్‌ఈసీ, పీఎఫ్‌సీ భాగస్వామ్యమై ఉన్నాయని.. అందుకే కేసును సీబీఐకి అప్పగించడం సముచితమని శాసనసభ భావిస్తోందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి దోచుకున్నవారిని శిక్షించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో అక్రమాలపై ఇప్పటివరకు నివేదికలు ఇచ్చిన ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, కాగ్, జస్టిస్ ఘోష్ కమిషన్... గత ప్రభుత్వాన్ని, నాటి ప్రభుత్వ పెద్దల్ని తప్పుపట్టాయి. తమ పరిధిలో ఉన్న ఏ సంస్థ దర్యాప్తు చేసినా తమ చిత్తశుద్ధిని శంకిస్తారని, అందుకే శషభిషలకు తావు లేకుండా కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు- ప్రకటించారు. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ చేసిన మోసం అంతాఇంతా కాదు. దీంతో తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లు కొల్లగొట్టారు. ఏఐబీపీ కింద ఏదైనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే 75 శాతం నిధులిచ్చే నిబంధన ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో 25 ప్రాజెక్టులను ఈ పథకం కింద కేంద్రం గుర్తించింది. ఆ జాబితాలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కూడా ఉంది. ఆ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు మార్చడం తోనే అవినీతికి తెరలేపారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాష్ట్రానికి గుది బండగా మార్చిన కేసీఆర్, హరీశ్‌రావును శిక్షించాల్సిన అవసరం ఉంది. రాజకీయ నాయకులు తమ ఇష్టాను సారం కట్టడాలను కట్టి డబ్బులు వెనకేసుకోవడం అలవాటుగా చేసుకున్నారు. ఎపిలో జగన్ కూడా ఇలాగే భీమిలి బీచ్‌లో రాజప్రాసాదాలను కట్టుకున్నారు. నిజానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఆకృతి, నిర్మాణం, నిర్వహణ అన్నవి ఓదావరి జలాలను ఉపయోగించాలన్న ప్రాతిపదికగా సాగలేదు. ప్రాజెక్టు వైఫల్యంగురించి ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికను ఎన్‌డీయే రిపోర్టని బిఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగింది. ఒకవేళ ఇది అవినీతి ప్రాజెక్ట్ కాకుంటే మేడిగడ్డ కూలిపోవడం ఎందుకు జరిగిందన్నది ప్రశ్న. అలాగే దీనితో ఉపయోగం లేదని తేలింది కూడా. ఇది ఉపయోగకర ప్రాజెక్ట్ అయితే ఎందుకు బిఆర్‌ఎస్ తప్పుడు విధానాలతో ఎదురుదాడికి దిగుతుందో చెప్పలేకపోతోంది. మొత్తంగా గోదావరిలో రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయి. దీనిపై విచారణ చేయించి లోపాలు ఎత్తిచూపిస్తే అడ్డుకుంటున్న తీరు బిఆర్‌ఎస్ అవినీతిని తేటతెల్లం చేస్తోంది. పిసి ఘోష్ కమిషన్ నివేదికలో ఏమైనా లోపాలుంటే వాటిని ప్రస్తావించ కుండా జస్టిస్ ఘోష్‌పై విమర్శలు చేయడం బిఆర్‌ఎస్ నేతల కక్కుర్తి రాజకీయం తప్ప మరోటి కాదు. నిజానికి తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించుకునేందుకు మహారాష్ట్ర అంగీకరించింది. అక్కడ ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని వాప్కోస్ చెప్పింది. అక్కడ 205 టీఎంసీల లభ్యత ఉందని అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇవేమీ కాదని... మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి మూడు లిఫ్టుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా నివేదిక ఇవ్వాలని ఆ సంస్థను అడిగారు. 2015లో రీడిజైన్ పేరిట కేసీఆర్ పెద్ద ఎత్తున అవినీతికి తెరలేపారు. ప్రాణహిత కాదని చేపట్టిన కాళేశ్వరంతో మూడు బ్యారేజీల నిర్మాణంతో విద్యుత్తు వినియోగం 3వేల మెగావాట్ల నుంచి 8,450 మెగావాట్లకు పెరిగింది రూ.38 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయం.. కాళేశ్వరం రీడిజైన్ కారణంగా రూ.1.47లక్షల కోట్లకు చేరింది. ఇది అవినీతికి పరాకష్ట అని లెక్కలు తెలియ చేస్తున్నాయి. అవినీతిపై ప్రపంచమంతా కోడై కూస్తున్నా కెటిఆర్, మరీస్ రావులు ఎదురుదాడి విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ తెచ్చానని డాంబికాలు పలుకుతున్న పెద్ద మనిషి అసంబ్లీకి కరావడం లేదు. జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని.. అందుకే కమిషన్ నివేదిక చెల్లదని కేసీఆర్, హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ ఇవే నోటీసులిస్తే.. అలా ఇవ్వడం చెల్లదంటూ కూడా కేసీఆర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ కమిషన్ అవే నోటీసులివ్వలేదని వితండవాదం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నిజానికి ఇలాంటి అక్రమాలకు పాల్పడినవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. రాష్ట్ర విభజన తరవాత విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడిన కెసిఆర్, జగన్‌లపై ప్రత్యే విచారణ కమిషన్ వేయాలి. వారి పాలన నాటి నిర్ణయాలను సమీక్షించాలి.

# పరకాల ఊచకోతకు 79 ఏళ్లు!”

## రజాకార్ల దాడికి సజీవ సాక్ష్యం పరకాల అమరధామం..








సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

(ఏటా సెప్టెంబరు 2న అమరులకు నివాళి) స్వేచ్ఛా స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో తెలంగాణా సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. హనుమ కొండ జిల్లా పరకాల లో జరిగిన పోరాటం చరిత్ర పుటల్లో స్థానం సంపాదించుకుంది. మరో జలియన్ వాలా బాగ్ పోరాటం గా చరిత్ర పుట ల్లోనూ పరకాల పేరు తెచ్చుకుంది. అజ్ఞాతంలోకి వెళ్లిన నాయకుల పిలుపు మేరకు గ్రామాలలో నిజాం నిరంకుశ పాలన రజాకార్లు బెదిరిస్తూ ప్రజలు త్రివర్ణ పతాకాలు ఎగురవేశారు. ఆ కార్యక్రమానికి 1947 సెప్టెంబర్ 2న అనేక గ్రామాల నుంచి వేలాది మంది తరలి వచ్చారు. పరకాల కి సుమారు ఐదు కిలోమీటర్ల పొడవు ఊరేగింపు సాగింది. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్లో కలపాలి అంటూ నినాదాలు చేశారు. వందే మాతరం అంటూ ర్యాలీ కొనసాగింది. అదే సమయములో రజాకార్లు పట్ట రాని కోపమును చూపి మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామానికి చెందిన వారిని చెట్టుకు కట్టేసి దారుణంగా చంపారు. ఆ సమయములో తెలంగాణ సాయుధ పోరాట వీరులు పరకాల పక్కన ఉన్న చెన్న కేశవ స్వామి ఆలయం పక్కన ఉన్న చంద్రగిరి గుట్ట దగ్గర సాయుధ పోరాటం జరిపారు. మందుగుండు సామాగ్రి, తపంచాలతో తమ స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయినా రజాకార్లు వీరిని వదిలిపెట్టలేదు. వీరి శిబిరాలపై తరచూ దాడులు చేస్తూనే ఉన్నారు. చివరగా 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభాయ్ పటేల్ ముందు నిజాం ప్రభుత్వం లొంగిపోవడంతో ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారు.ఆ మట్టి.. రజాకార్లు పారించిన రక్తపుటేర్లకు సాక్ష్యం! నిరంకుశ నిజాం నుంచి సాతంత్ర్యాన్ని కాంక్షించి అమరులైన యోధుల పోరాటానికి సాక్ష్యం! అదే.. మరో జలియన్‌వాలాబాగ్ ఘటనగా చరిత్రలో నిలిచిపోయిన పరకాల ఊచకోత ఘటన! సరిగ్గా 79ఏళ్ల క్రితం.. 1947లో ఇదే రోజున (సెప్టెంబరు2న) జాతీయ పతాకాన్ని ఎగురవేయాలనే కాంక్షతో చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషసంఖ్యలో హాజరైన ప్రజలపై రజాకార్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. నాటి ఘటనలో 15మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతోమంది క్షతగాత్రులయ్యారు! 20 ఏళ్లక్రితం అమరుల స్మారకార్థం ఊచకోత జరిగిన ప్రాంతంలో అప్పటి బీజేపీ నేత, మాజీ మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు కేంద్రమంత్రి హెూదాలో అమరధామాన్ని నిర్మించారు. ఏటా సెప్టెంబరు 2న అక్కడ స్వాతంత్ర్య సమరయోధులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు,విలేఖరులు నాటి ఘటనలో అమరులైన వారికి నివాళు లు అర్పిస్తుంటారు. హనుమకొండ జిల్లా పరకాల పట్టణములో తహసిల్ రోడ్ లో అమరదామం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంధి.రజకార్ల చేతిలో చంపపడిన వారి శిల్పాలు వరుస క్రమంలో అమర్చినారు.చేతులు పిడికిలి ఎత్తి,ఒక చేతిలో కర్ర పట్టి పోరాటానికి పయనిస్తూ వున్నట్లు వుంటాయి.గుమ్మటం పై భాగాన చెట్టుకి కట్టి చంపిన దృశ్యాలు,వారి దేహం నుండి తూట తగిలి రక్తం కారడం,కాళ్లు తెగి పడిన ఘటన ఒళ్లు జలధ రిస్తుంది.ఆ శిల్పాలు,మట్టి మనుషుల బొమ్మలు చూస్తె నర నరాన ఆవేశం పొంగి పొర్లుతుంది.యుద్ధం కి సై అన్నట్లు భావన కలుగుతుంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన ఉద్యమం లో సభలు,సమావేశాలు,ర్యాలీ లు,ధూమ్ - దా%శీ% లకు,ఆట పాటలకు వేదిక గా నిలిచింది.కొన్ని విప్లవ సినిమాల,సీరియల్ల షూటింగుల కు నిలయం గా మారింది.పర్యాటకులు నిత్యం వందల సంఖ్య లో నిత్యం దర్శించు కుంటున్నారు. అమరధామం పక్కన వున్న పార్క్ లో వివిధ రకాల మొక్కలు పచ్చదనం తో నిండి స్వచ్ఛమైన గాలిని అందిస్తూ వున్నాయి. పట్టణ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పార్క్ కి వచ్చి సేద తీరుతున్నారు. పరకాల మట్టి వాసన అందరిలో వీరత్వానికి సంకేతంగా నిలుస్తుంది.పరకాల ఊచకోత లో అసువులు భాసినవారు రంగాపూర్ (మొగుళ్ల పల్లి మండలం),కానిపర్తి( రేగొండ) వారు గా చరిత్ర తెలుపుతూ వుంది.అమరవీరుల ఆశయలను కొనసాగించుదా%శీ%.వారి బాట లో పయనం చేద్దాం.వారి త్యాగములను స్మరించుకుందాం.బావి తరాలకు వారి పోరాట పటిమను తెలుపుధాం. అమరధామం ని మరింత అభివృద్ధి చేయాలి. నేటి తరం విద్యార్థులు అమరధామం గూర్చి తెలుసుకోవాలి.

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్
భూపాల్ పల్లి జిల్లా
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు . (సెప్టెంబర్ 2 న అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా)
9848445134..

# ఆరోగ్య శ్రీ ప్రదాత డా. వై ఎస్ ఆర్ వర్ధంతి (సెప్టెంబర్ 2)



ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ వేదికపై అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తులలో డా. వై ఎస్ రాజశేఖర రెడ్డి ఒకరు. అహంలేని వ్యక్తిత్వం కొందరికే చెల్లుతుంది. అలా జన్మించి జనం గుండెల్లో చిరకాలం గుర్తుండేలా గూడుకట్టుకున్న మహెూన్నత వ్యక్తి యై ఎస్ రాజశేఖర్ రెడ్డి. ఈయన పూర్తిపేరు ఏడుగురి సందింటి రాజశేఖర్ రెడ్డి. ఈయన జూలై 8,1949 లో రాజారెడ్డి, జయమ్మ దంపతులకు జమ్మలమడుగు మిషన్ ఆసుపత్రిలో జన్మించారు. ఈయన స్వస్థలం బలపనూరు. ఈయన విద్యాభ్యాసం కడప జిల్లా పులివెందుల లో ప్రారంభమైంది. కర్ణాటక లోని బళ్ళారి లో హై స్కూల్ చదువు, విజయవాడ లయోలా కళాశాలలో పి యు సి, గుల్బర్గా లోని ఎం.అర్.మెడికల్ కళాశాలలో మెడికల్ విద్యను అభ్యసించారు. ఎస్.వి.కళాశాల తిరుపతి లో హౌస్ సర్జన్ గా చేశారు. సహజ సిద్ధంగా నాయకత్వ లక్షణాలున్న వైఎస్ మెడికల్ కళాశాల విద్యార్థి సంఘం నాయకుడిగా ఎన్నికైనారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి తొలి మెట్టు. 1975 లో యువజన కాంగ్రెస్ నాయకుడిగా రాజకీయ రంగంలోకి అరంగేట్రం చేశారు. 1978 లో తొలిసారిగా పులివెందుల నుండి రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవు - దూడ గుర్తుపై పోటీచేసి విజయం సాధించారు. తరువాత ఇందిరా కాంగ్రెస్ లోకి మారారు. వీరి జీవితకాలంలో మొత్తం ఆరు పర్యాయాలు శాసన సభ్యులు గా, నాలుగు సార్లు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైనారు. రెండు సార్లు పి సి సి అధ్యక్షునిగా పనిచేశారు. ఒక డాక్టర్ గా వంద మందికి సేవ చేసే భాగ్యం కలుగుతుంది, కానీ రాజకీయ రంగంలో లక్షలాది ప్రజలకు సేవ చేసే భాగ్యం లభిస్తుంది కాబట్టే రాజకీయాల లోకి వచ్చినట్లు ఆయన చెప్పేవారు. నిజానికి 1969లో ఇందిరాగాంధీ చేపట్టిన బ్యాంకుల జాతీయీకరణ ఆయన్ని అమితంగా ఆకర్షించింది. కాంగ్రెస్ వైపు దృష్టి మరల్చేలా చేసింది. స్నేహాన్ని ప్రాణంగా భావించే వైఎస్ కి గుల్బర్గా మెడికల్ కళాశాలలో జరిగిన ఒక సంఘటన అతనికి మంచి స్నేహితున్ని ఇచ్చింది. ఆయనే కే.వి.పి.రామచంద్రరావు. వీరిద్దరిదీ ఒకే ఆత్మ ,దేహాలు వేరు అనేంతలా ఉండేవారు. 1980 లో టంగుటూరి అంజయ్య మంత్రి వర్గంలో తొలి సారిగా మంత్రి పదవి చేపట్టారు. 1980-82 లో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా, 1982 భవనం వెంకట్రామిరెడ్డి మంత్రి వర్గంలో అబ్కారీ, 1982-83 కోట్ల విజయ భాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా చేశారు. తను అనుకున్నది ఎంతటి కష్టమైనా, ఎంతటి నష్టమైనా సాధించాలనే పట్టుదల, తపన గల విశిష్ట వ్యక్తిత్వం గలిగిన వ్యక్తి వైఎస్సార్. కుల రహిత, మత రహిత సమాజం కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి వైఎస్సార్. 1999-2004 కాలంలో వైఎస్సార్ ఆంధ్రప్రదేశ్ శాసన సభలో ప్రతిపక్ష నాయకుడు గా పనిచేశారు . 2003 లో ఈయన ప్రారంభించిన “ప్రజా ప్రస్థానం” చరిత్రలో లిఖించబడినది. చేవెళ్ల నియోజకవర్గం నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వరకు 1476 కిలోమీటర్ల దూరం పాదయాత్ర నభూతో న భవిష్యత్ అన్నట్లు జరిగింది. మండుటెండల్లో 68 రోజుల పాటు 11 జిల్లాల గుండా సాగిన ఈ ప్రజా ప్రస్థానం పాదయాత్రలో డా.వైఎస్సార్ తలపాగా, పంచె కట్టుతో తెలుగు సంప్రదాయం. తో నేరుగా ప్రజలతో అనుసంధానమై వారి కష్టాలు వింటూ వారికి భరోసా కల్పిస్తూ రాబోయే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా సుఖంగా , సంతోషంగా జీవిస్తారని తెలుపుతూ కొనసాగిస్తున్నారు. 2004 జరిగిన శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్ నేతృత్వం లోని కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఏప్రిల్15, 2004 న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా దా వైఎస్సార్ ప్రమాణ స్వీకార చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తాను ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలుకై తొలి సంతకం చేసి తన చిత్తశుద్ధి నీ నిరూపించుకున్నారు. తన పరిపాలన ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కొనసాగించారు. జలయజ్ఞం, ఆరోగ్య శ్రీ, కిలో బియ్యం రెండు రూపాయలకు, ఫీజు రీయింబర్సమెంట్, పావలా వడ్డీ, పారిశ్రామిక అభివృద్ధి ఇలా అనేక రంగాల్లో తన ముద్రను మిగిల్చారు వైఎస్సార్. అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీ చేశారు. పార్టీలకు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరూ లబ్దిదారులు గా ఉండాలని ఆయన చెప్పేవారు. తాను ఇచ్చిన హామీలను , అమలు చేసిన విధానాన్ని చూసి 2009 ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన మని 2009 లో ప్రజల వద్దకు వెళ్లారు వైఎస్సార్. తిరిగి విజయం సాధించి రెండవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రం నుండి 33 మంది ఎం పి లను అందించి కాంగ్రెస్ హై కమాండ్ వద్ద తిరుగులేని అభిమానం సంపాదించుకున్నారు. 2004 లో రాజీవ్ పల్లెబాట, 2005 లో రాజీవ్ నగరబాట వంటి ప్రజాహిత కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాగా మమేకమై పోయారు. తెలుగు భాషకు ప్రాచీన హెూదా కల్పించడం లో వైఎస్సార్ పాత్ర శ్లాఘనీయం. అసంఖ్యాక ప్రజలకు నేరుగా సేవలందించడానికి రాజకీయాలే మార్గమని చిన్నప్పుడు వెంకటప్పయ్య మాస్టర్ చెప్పిన మాటలు రాజశేఖర్ రెడ్డి నీ రాజకీయాల వైపు మళ్లించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకోవడానికి ఉద్దేశించబడిన కార్యక్రమం రచ్చ బండ లో పాల్గొనడానికి 2009, సెప్టెంబర్ 2 న చిత్తూరు కు వెళ్ళవలసిన వైఎస్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో నల్లమల అటవీ ప్రాంతంలో పావురాల్ల గుట్ట వద్ద కూలిపోయింది. సెప్టెంబర్ 3 హెలికాప్టర్ ఆచూకీ గుర్తించిన అధికారులు అందులో గుర్తించడానికి సైతం వీలు లేకుండా కాలి పోయిన మృత దేహాలను చూసి నిర్ఘాంత పోయారు. దేశం మొత్తం డా.వైఎస్సార్ మరణంతో తల్లడిల్లింది. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయన ప్రవేశ పెట్టిన పథకాల రూపంలో ఎప్పటి నిల్చిండి పోతారు. పేద ప్రజల దేవుడు వైఎస్సార్.
జోహార్ వైఎస్సార్........

డా. జె.వి.ప్రమోద్ కుమార్
పైడిమెట్ట 9490833108.

# ములుగు పల్లి పాఠశాలలో ఘనంగా పఠనోత్సవ కార్యక్రమం

**సమయజ్యోతి భూపాల్ పల్లి**

రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మహా ముత్తారం మండలం ములుగు పల్లి ఉన్నత పాఠశాలలో పఠణోత్సవ కార్యక్రమం నిర్వహించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కైరిక సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న అంతర్గత శక్తులను వెలికి తీయడానికి ఈ పఠన ఉత్సవం దోహద పడుతుందని విద్యార్థులు నిరంతనం పఠనం చేయడం ద్వారా ఉత్తమ పాఠకులుగా ఎదుగుతారని తెలిపారు ప్రతిరోజు విద్యార్థి కథల పుస్తకాలు వివిధ భాషల్లో చదవడం వల్ల భాషా దోషాలు లేకుండా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు జోక్స్ జీకే కథలు సూక్తులు పొదుపు కథలు తదితరాలు చదివి విజ్ఞానవంతులు కావాలని పేర్కొన్నారు కార్యక్రమం 15 రోజులపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు కార్యక్రమాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఉత్తమ పాఠకులుగా ఎదగాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఏ అనిల్ నాయక్ సకరం నాయక్ కామిడి సతీష్ రెడ్డి పెనుకుల యాదగిరి జి సుధాకర్ రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు




# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మెండోరా**

మెండోర మండల కేంద్రంలోనిసోనాపేట్ దూదిగా%శీ% నెహ్రూ నగర్ గ్రామాల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ లక్ష్మణ్ వార్డ్ వైజ్ గా పరిశీలించారు, కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు భోజన్న, భరత్ కుమార్, శ్రీనివాస్ బిఎల్వోస్ భూలక్ష్మి కమల రోజ హెలెన్ సోనీ గంగమని తదితరులు పాల్గొన్నారు



# యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం: సిపిఐ నేత గుంటి వేణు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రైతులకు యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ప్రతిరోజు యూరియా కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తపరిచారు. రైతన్న యూరియా కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మంత్రి చంద్రన్న, మిద్దె నరసన్న, అనవేని బూదన్న, నీరెడ్డి బాలయ్య, చికోటి రాజు, కంచం కిషన్, అనలేని రాజు, అనంతుల రాజు, నీరటి ఎల్లయ్య పాల్గొన్నారు.




# ప్రజావాణితో సమస్యల పరిష్కారం : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి ఆయన 126 అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా సమన్వయంతో జరుపుకోవాలి : సీఐ శ్రీధర్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంతంగా సమన్వయంతో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ కే శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారము బాల్కొండ మండల కేంద్రంలోని ఎంకే ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణపతి ఉత్సవాలు ఎవరి భావాలనూ దెబ్బతీయకుండా, శాంతి భద్రతలతో జరుపుకోవాలని, డీజే సౌండ్, లౌడ్ స్పీకర్లు పరిమితికి మించి వాడరాదు, ఎలాంటి వివాదాలు తలెత్తకుండా అందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. గణపతి నిమజ్జన సమయంలో పోలీస్ శాఖ అందించే భద్రతా చర్యలకు ప్రజలు సహకరించాలని, చిన్నపాటి సమస్యలైనా వెంటనే పోలీసులకు తెలపాలని, ఎవరూ స్వయంగా చట్టం చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై శైలేందర్, తాసిల్దార్ శ్రీనివాస్, జిపి కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, విద్యుత్ అధికారి కిషన్, మండపాల నిర్వాహకులు, మర్కస్ కమిటీ సభ్యులు మైనార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

**సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 01 బజార్ హత్నూర్**

నేరడిగోండ మండల కేంద్రంలో భారతీ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ ప్రధాని మోదీ తల్లి పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమ వారం నాడు అంబేద్కర్ చౌక్ లో ధర్నా కార్యక్రమం నిర్వహించడం ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని లెని పక్షంలో రోడ్ల పై తీరగలేరని అన్నారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి,అడెపు రమేష్, సురేష్, ఉత్తమ్ సింగ్, ప్రధాన కార్యదర్శి రజింత్, కార్యదర్శి భీం రావ్, మాజీ ఎంపిటిసి దురువ రాజు, శ్రీధర్ రెడ్డి,అంత్రం భీం రావ్, విలాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు



# సూపర్ మార్కెట్ డ్రా విజేతలకు బహుమతులు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని బాలాజీ సూపర్ మార్కెట్ తొలి వార్షికోత్సవము సందర్భంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఎఎంసి చైర్మన్ తలారి రాణి నర్సింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి చేతుల మీదుగా లక్కీ డ్రా నిర్వహించి, పదిమంది విజేతలకు బహుమతులు అందజేశారు.




# మట్టి తరలింపు కు అవసరమైన అనుమతులు పొందాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైల్వే లైన్ నిర్మాణానికి మట్టి తరలింపు అవసరమైన అనుమతులు పకడ్బందీగా పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం ఆయన, జిల్లా కలెక్టరేట్ లో రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన మట్టి అనుమతుల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైల్వే లైన్ నిర్మాణం కోసం తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం చంద్రవాగు చెరువు నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి కేటాయింపు చేయగా ఇప్పటి వరకు 90 వేల 672 క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపు జరిగిందని అన్నారు. సిరిసిల్ల లో రైల్వే స్టేషన్ నిర్మాణం, రైల్వే లైన్ నిర్మాణం కోసం సమీపంలో గల పాయింట్ నుంచి అవసరమైన మట్టి తరలింపు కేటాయింపు చేయాలని, దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మట్టి తరలింపు కు తగిన విధంగా సినరేజి చార్జీలు వసూలు చేయాలని అన్నారు. నిర్దేశిత కేటాయింపుల మేరకు మాత్రమే మట్టి తరలింపు జరగాలని, అదనంగా మట్టి తరలించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారి మూర్తి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను కల్సిన ఆరోగ్య క్షేత్ర స్థాయి సిబ్బంది

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**

ఆధార్ బేసుడ్ అటెండెన్స్ రద్దు గూర్చి జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ ని 3194 యూనియన్ మరియు ఎస్ సి/ఎస్ టి యూనియన్ ఆదిలాబాద్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కలువడం జరిగింది కలెక్టర్ రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదిక పంపుతానన్నారు అలాగే మీరు కూడా వెల్లి కమిస్సనర్ అలాగే డైరెక్టర్ అఫ్ హెల్త్ గారికి కూడా వినతి పత్రం ఇవ్వాలని, మేముకూడా అధికారికంగా పంపడం జరుగుతున్నది అని కలెక్టర్ చెప్పడం జరిగింది,అబ్బా ( అభా) అటెండెన్స్ రద్దు గూర్చి 3194 జిల్లా నాయకులు సంతోషకుమార్,Sc/St జిల్లా ప్రసిడెంట్ ఆడే సురేష్, ప్రధాన కార్యదర్శి బొమ్మెత సుభాష్, అంజయ్య, ట్రేజరర్ జాదవ్ అనిల్, గంగాధర్, జ్ఞానేశ్వర్, రవీందర్, తులసిరామ్, శ్యామల, సుశీల, కవిత, సంధ్య, యశోద,లీలా, సుగుణ, కవిత, లక్ష్మి,కళావతి, వసంత,రాజ్యలక్ష్మి, అన్నపూర్ణ, ఆశమ్మా, రోజరాణి, గణేష్ కుమారి, జిల్లా సూపర్స్ వైజార్స్ కమీటి ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుండి పాల్గొన్నారు.



# వినాయకుని సన్నిధానంలో అన్నదానం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు తడుక బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించి వందలాది మంది భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత రైస్ మిల్లరు కోడం విష్ణుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌడ కృష్ణారి, ఎనగందుల దశరథం, దొంత బాలరాజు, శ్రీరామ్ మనోహర్, బిట్ల దేవానందం, ఎనగందుల శంకర్, తాటిపాముల



# దేవేందర్ యాదవ్ ను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

బిఆర్ఎస్ పార్టీ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షులు రాగం దేవేందర్ యాదవ్ ను పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం పరామర్శించారు ఇటీవల దేవేందర్ యాదవ్ తండ్రి రాగం కొమర్య యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు స్థానిక నాయకులతో కలిసి సోమవారం దేవేందర్ యాదవ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మాజీ ఎంపీటీసీ నరసింహ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# కబ్జకు గురైన భూములను కాపాడండి

## జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన ఉమ్మడి మండల బీజేపీ నాయకులు......

సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణపేట జిల్లా

మండలంలోని గురుజాల మురహర్ దొడ్డి గ్రామాలలోని కబ్జకు గురైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సోమవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉమ్మడి మండల బిజెపి నాయకులు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ విషయంపై మండల తహసీల్దార్ ను అడిగి వివరాలు తెలుసుకుంటానని అన్నారు. ఉమ్మడి మండలాల అధ్యక్షుడు నల్లె నరసప్ప,జిల్లా నాయకులు మజ్జిగ సురేష్, వాకిటి మల్లేష్,హుస్సేనప్ప, మాజీ వైస్ ఎంపీపీ ఆర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు దండు రాఘవేంద్ర,కే తిమ్మప్ప,వీరేష్ పాల్గొన్నారు.



# శ్రీ గణేష్ నగర్ వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత మండల కేంద్రంలోని శ్రీ గణేష్ నగర్, బీసీ కాలనీ వినాయక చవితి బాలగణేష్ మండపంలో కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. అనంతరం కాలనీ వాసుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కొంకతి నర్సిములు అలివేలమ్మ, ఒగ్గు రామలింగం సువర్ణ, రమేష్ సుమ, సురేష్ భాగ్య లక్ష్మి, చిన్ని సీతారాములు లక్ష్మి, పి. కుర్మన్న పవిత్ర, కుర్వ మహేందర్ బాలమణి, కృష్ణయ్య, ఉమా తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# కి!! శే!! బిషంబ్లి బిరమ్మ జ్ఞాపకార్థంగా కుట్టు మిషన్ల పంపిణీ చేసిన బిటియం సేవా ఫౌండేషన్....

సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా

కి.శే " బిషంబ్లి బిరమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా బీటీఎం సేవ ఫౌండేషన్ ఫౌండర్ తిమ్మయ్య సోమవారం నారాయణపేట జిల్లా లోని పలు గ్రామాలలోని పేద మహిళా కుటుంబాలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది.లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఫౌండేషన్ టీం సభ్యులు స్వయంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఉట్కూరు మండలం అమీన్పూర్ గ్రామానికి చెందిన బాదలి లక్ష్మి,మాగనూరు మండలం అడవి సత్యారం గ్రామానికి చెందిన మహాదేవి,ఉట్కూర్ మండలం చిన్నపోర్ల గ్రామానికి చెందిన బోయపుండు సంజమ్మ,ఊట్కూరు మండలం బిజ్వార్ గ్రామానికి చెందిన బోయ అనంతమ్మ కు పంపిణి చేశారు.చింతన్ పల్లి శివప్రసాద్ రెడ్డి (శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, నారాయణపేట జిల్లా) మాట్లాడుతూ "బి.టి.యం సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చూస్తుంటే ఎంతో సంతోషం కలుగుతుంది. సమాజానికి ఇలాంటి సహాయం చేస్తూ ముందుకు వెళ్తున్నందుకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి. కృష్ణ, చెన్నయ్య గౌడ్,నింగప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.



# గణేశునికి ఏకాదశ నైవేద్యాల సమర్పణ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము మద్దికుంట గ్రామంలో లయన్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారము ఏకాదశ నైవేద్యాలను సమర్పించారు. వేద పండితులు శాస్త్రుల మెట్టురామ శర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో నీరాజనం పలిపారు.



# రైతులకు యూరియా కొరత లేదన్న జిల్లా కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో సెప్టెంబర్ 01.

జిల్లాలో రైతులకు యూరియా ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లాలో అవసరమైనంత మోతాదులో యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఎరువుల దుకాణాలను ఉదయం 8 గంటలకు తెరిపిస్తున్నామని చెప్పారు. రైతులు ఒకేసారి గుంపులుగా దుకాణాలకు వెళ్లకుండా విడతల వారీగా వెళ్లి అవసరమైనంత మేరకు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా కొరతపై అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని, జిల్లాలోని ప్రతి రైతు అవసరానికి తగ్గట్టుగానే యూరియా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎరువుల సరఫరా పర్యవేక్షణకు వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.



# ప్రజావాణిలో 84 దరఖాస్తుల స్వీకరణ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,ట్రైనీ కలెక్టర్ సలోని ఛాబ్రా,ఆయా మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించి ఆయా శాఖలకు అప్పగిస్తూ త్వరిత గతిన పరిష్కరించాలని అన్నారు.ఈ సందర్భంగా 84 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# గణేశునికి ఏకాదశ నైవేద్యాల సమర్పణ

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము మద్దికుంట గ్రామంలో లయన్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారము ఏకాదశ నైవేద్యాలను సమర్పించారు. వేద పండితులు శాస్త్రుల మెట్టురామ శర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో నీరాజనం పలిపారు.



# కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ నాయకుల చేరికలు

సమయజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 01 బజార్ హత్నూర్

సిరికొండ మండలానికి చెందిన పలువురు నాయకులు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో చేరారు. బిసి 42 శాతం రిజర్వేషన్ల బిల్లు చారిత్రాత్మకం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కిసొసైటీ డైరెక్టర్ డైరెక్టర్ గొర్ల రాజన్న యాదవ్ తెలిపారు. నాయకులు యండి జైనుల్, హైదర్, ముక్రం, చంటి లస్మన్న, అన్వర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారిని పార్టీ కండువాలేసి స్వాగతించారు. వారు అమలు చేస్తున్న పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారుఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు జరుగుతున్నాయని తెలిపారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కలిసి కట్టుగా కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ చైర్మన్ కుంరం సత్యవతి కోటేష్, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి,మాజి జడ్పీటీసీ చంద్రకళ రఘరామ్, ఎ ఎం సి డైరెక్టర్ లు జగన్, ప్రకాష్, ఆనంద్ రావు, మాధవ్ పటేల్ కంచం లక్ష్మన్, బోథ్ బ్లాక్ ఆత్మ డైరెక్టర్ స్వామి, బోథ్ మాజీ ఎంపీటీసీ మహేందర్,పట్టణ అధ్యక్షులు జెల్ల సతీష్ ఇమామ్,బొడ్డు నవీన్, బొడ్డు దత్తు,మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్,రషీద్,సదానందం,గురుమూర్తి, ప్రకాష్ పటేల్, గుణవంత్, బదు పటేల్, పండు పటేల్, రమేష్, ఆఫిస్, ఎల్లయ్య, మంగ గంగులు, యువ నాయకులు సద్దాం, అశోక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాధితుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా గ్రీవెన్స్ డే:ఎస్పీ మహేష్ బి.గితే

సమయజ్యోతి న్యూస్ సిరిసిల్ల ప్రతినిధి.

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు. 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



# వినాయక అన్నదాన కార్యక్రమాలలో కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ వర్తక సంఘం పద్మశాలి సంఘం కాకతీయ నగర్ కాలనీ పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్లో బాంబే కాలనీ తెల్లాపూర్ లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నట్లు రామచంద్రాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ తెలిపారు



# గ్రాడ్యుయేట్ల కీలకమైన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించండి -ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ న్ను సోమవారం ఢిల్లీలో కలిసి రాష్ట్రంలో విద్యాశాఖలో నెలకొన్న పలు విద్యారంగ సమస్యల పై చర్చించి వారికి వినతి పత్రం ఇచ్చినట్లు కరీంనగర్ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి తెలిపారు వినతిపత్రం లోని అంశాలు ముఖ్యంగా తెలంగాణా రాష్ట్రంలో1) రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో ఫ్యాకల్టీ నియామకం: తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో మంజూరైన ఫ్యాకల్టీ పోస్టులు గణనీయమైన సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి ఇవి విద్యా ప్రమాణాలుపరిశోధన ఉత్పాదకత మరియు విద్యార్థుల అభ్యాస ఫలితాలను తీవ్రంగా రాజీ పడేస్తున్నాయి పారదర్శక మెరిట్ ఆధారిత నియామక ప్రక్రియలను సులభతరం చేయడానికి మరియు సంస్థాగత బోధనా సామర్థ్యాలను పెంపొందించడానికి ఒక ప్రత్యేక కేంద్ర కార్యక్రమాన్ని ప్రారంభించాలని నేను మంత్రిత్వ శాఖను కోరుతున్నాను2) సర్వ శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలు: తెలంగాణలోని వేలాది మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు సహాయక సిబ్బందితో సహా సకాలంలో జీతాల చెల్లింపు సర్వీస్ క్రమబద్ధీకరణ లేకపోవడం మరియు సామాజిక భద్రతా ప్రయోజనాలు లేకపోవడం వల్ల చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు ఈ సమస్యలు వారి నైతికతను మరియు విస్తరణ ద్వారా పాఠశాల విద్య నాణ్యతను ప్రతికూలంగా ప్రభావితం చేశాయి 3)ఇంజనీరింగ్ సంస్థల నాణ్యత పర్యవేక్షణ: తెలంగాణ రాష్ట్రంలోని అనేక ఇంజనీరింగ్ కళాశాలలు తగినంత అధ్యాపకులు మౌలిక సదుపాయాలు మరియు వనరులతో పనిచేస్తున్నాయి ఇది విద్యా నాణ్యతను దెబ్బతీస్తోంది తప్పనిసరి కాలానుగుణ ఆడిట్‌లు మరియు నియంత్రణ నిబంధనల అమలు ద్వారా ఏఐసీటీఈ పర్యవేక్షణ చట్టాన్ని బలోపేతం చేయడం ప్రమాణాలను నిలబెట్టడానికి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటానికి చాలా అవసరం4) ఏఐ/ఎంఎల్ మరియు ఎమర్జింగ్ టెక్నాలజీ ప్రోగ్రామ్‌ల విస్తరణ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్ అనుబంధ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో ప్రోగ్రామ్‌లకు పెరుగుతున్న డిమాండ్ సీట్ల విస్తరణకు సమతుల్య విధానాన్ని కలిగి ఉండాలి దీనికి అర్హత కలిగిన అధ్యాపకులు అత్యాధునిక పరిశోధన సౌకర్యాలు మరియు బలమైన పరిశ్రమ సహకారాల ద్వారా మద్దతు ఇవ్వాలి 5) వైద్య విద్య మరియు సీట్ల విస్తరణ: ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ వైద్య కళాశాలలను విస్తరించడంలో తెలంగాణ ప్రశంసనీయమైన పురోగతి సాధించింది అయినప్పటికీ రాష్ట్రం ఇప్పటికీ జనాభా నిష్పత్తికి వైద్యుల కొరతను ఎదుర్కొంటోంది మౌలిక సదుపాయాలు మరియు అధ్యాపక నియామకాలను బలోపేతం చేయడానికి మాత్రమే కాకుండా ఇప్పటికే ఉన్న కొత్త వైద్య కళాశాలలలో ఎంబీబీఎస్ మరియు పీజీ వైద్య సీట్లను మరింత పెంచడానికి కూడా మంత్రిత్వ శాఖ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో సహకరించాలని నేను కోరుతున్నాను తద్వారా అర్హత కలిగిన ఆరోగ్య సంరక్షణ నిపుణుల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను పరిష్కరించాలి 6) సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ములుగు: ఈ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ స్థాపన గిరిజన విద్య నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక-ఆర్థిక సాధికారతను ముందుకు తీసుకెళ్లడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని సూచిస్తుంది దీనికి సంబంధించిన నిధులను త్వరితగతిన కేటాయించి శాశ్వత క్యాంపస్ నిర్మాణం అధ్యాపక నియామకం మరియు ప్రత్యేక విద్యా కార్యక్రమాలను ప్రవేశపెట్టడం దాని పూర్తి సామర్థ్యాన్ని తప్పనిసరి 7) యూజీసీ గ్రాంట్లు మరియు సంస్థాగత మద్దతు: మౌలిక సదుపాయాలను ఆధునీ కరించడానికి డిజిటల్ అభ్యాస వాతావరణాలను మెరుగుపరచడానికి లైబ్రరీ వనరులను అప్‌గ్రేడ్ చేయడానికి మరియు విద్యార్థుల సంక్షేమ పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మరియు అనుబంధ కళాశాలలకు విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ నిధులను సకాలంలో పంపిణీ చేయడం చాలా ముఖ్యం వనరుల అంతరాలను తగ్గించడానికి మరియు పరిశోధన నైపుణ్యాన్ని ప్రోత్సహించడానికి తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు యూజీసీ కేటాయింపులను పెంచడాన్ని పరిగణించాలని నేను మంత్రిత్వ శాఖను అభ్యర్థిస్తున్నాను 8) సమ్మతి మరియు పాలన: యూజీసీ కి ఖచ్చితంగా కట్టుబడి ఉండేలా చూసుకోవడం మరియు ఏఐసీటీఈ నిబంధనలు బలమైన యాంటీ-ర్యాగింగ్ ప్రోటోకాల్‌లు మరియు పాలన సంస్కరణలు చాలా ముఖ్యమైనవి మంత్రిత్వ శాఖ మద్దతు ఇచ్చే సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్‌లు మరియు జవాబుదారీతనం సంస్థలు సమ్మతిని సాధించడంలో మరియు నిర్వహించడంలో గణనీయంగా సహాయపడ తాయి చర్యలు ఈ ముఖ్యమైన విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ విద్యా







మంత్రిని వినయంగా అభ్యర్థిస్తున్నాను తెలంగాణలో ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో అధ్యాపక నియామకం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించి ప్రత్యేక కేంద్ర మద్దతు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం క్రమబద్ధీకరణ ప్రయోజనాలలో సమానత్వం మరియు సకాలంలో జీతాల చెల్లింపు ద్వారా ఎస్-ఎస్ఏ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించండిరాష్ట్రంలోని ఇంజనీరింగ్ సంస్థల నాణ్యతా ఆడిట్‌ను పూర్తి స్థాయిలో నిర్వహించాలని మరియు స్థిరపడిన నిబంధనలకు కట్టుబడి ఉండేలా అమలు చేయాలని ఏఐసీటీఈ సూచించడంఏఐ/ఎంఐ మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కోర్సుల వ్యూహాత్మక విస్తరణను సులభతరం చేయడం లక్ష్య అధ్యాపక శిక్షణా కార్యక్రమాలతో అనుబంధంగా ఉండటం తెలంగాణలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అధ్యాపక బలాన్ని పెంచడానికి మరియు అదనపు ఎంబీబీఎస్ మరియు పీజీ వైద్య సీట్లను మంజూరు చేయడానికి ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతో సహకరించండి ములుగులోని సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ యొక్క కాలపరిమితి పురోగతికి ప్రాధాన్యత ఇవ్వడం వేగవంతమైన నిధులు మరియు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ఎక్కువ కేటాయింపులు పారదర్శకత మరియు పర్యవేక్షణ చట్రాలతో యూజీసీ గ్రాంట్ల విడుదలను మెరుగుపరచడం మరియు క్రమబద్ధీకరించడం మీ దార్శనిక నాయకత్వంలో తెలంగాణలోని గ్రాడ్యుయేట్లు విద్యార్థులు ఉపాధ్యాయులు మరియు విద్యా సమాజాన్ని ప్రభావితం చేసే ఈ కీలకమైన సమస్యలను వారు అర్హత కలిగిన అత్యవసరం మరియు ప్రాధాన్యతతో పరిష్కరిస్తారని నాకు నమ్మకం ఉంది మీ జోక్యం రాష్ట్ర విద్యా రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా సమానత్వాన్ని పెంపొందించే జాతీయ లక్ష్యానికి గణనీయంగా దోహదపడుతుంది అని అంజిరెడ్డి తన వినతిపత్రం లో పేర్కొన్నారు

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

## : హర్షం వ్యక్తం చేసిన డిసిసి అధ్యక్షులు శ్రీనివాస రావు

సమయజ్యోతి న్యూస్ కామారెడ్డి బ్యూరో

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానించడం పట్ల కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు పోతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి, దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కామారెడ్డి పట్టణంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి, దాన్ని అమలు చేసేందుకు ముందడుగు వేయడంతో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున కార్గే, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గొడుగుల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, సబ్బని శంకర్, సర్వర్, కిరణ్, సిద్ధిక్, లక్కపతిని పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

## ఎమ్మెల్యే జీ ఎం ఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు పట్టణాలు డివిజన్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని నిర్దేశించిన గడువు లోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు సోమవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు హెచ్ఎండబ్ల్యూఎస్ విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఏర్పాటైన ఇంద్రేశం జిన్నారం ఇస్నాపూర్ గడ్డపోతారం గుమ్మడిదల మున్సిపాలిటీలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు నూతన మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకొని రాగా జిహెచ్ఎంసి అధికారులతో చర్చించి రాంకీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డ్ ప్లాంటుకు చెత్తను తరలించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు ఇస్నాపూర్ చౌరస్తాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా విశాలమైన ప్రాంగణంలో మున్సిపల్ కార్యాలయం నిర్మించేందుకు ప్రణాళిక పొందిస్తున్నట్లు తెలిపారు అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ పరిధిలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన రిజర్వాయర్లను సెప్టెంబర్ 10వ తేదీన ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు నూతన రిజర్వాయర్ల ద్వారా సమీప కాలనీల ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు గుమ్మడిదల నుండి కానుకుంట రహదారి మరమ్మతు పనులు ప్రారంభించామని తెలిపారు వర్షాకాలం ముగిసిన వెంటనే శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు తెలిపారు గత రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలు మూలంగా నియోజకవర్గ పరిధిలో ధ్వంసమైన రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు



# రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉర్దూ జర్నలిస్టులకు 2 రోజుల శిక్షణా శిబిరం

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధిత్వంలో ఆగస్టు 30,31 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఉర్దూ జర్నలిస్టుల కోసం 2రోజుల శిక్షణా శిబిరం నిర్వహించబడింది.ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ జర్నలిస్ట్ షాహిద్ అహ్మద్ తవక్కల్ పర్యవేక్షణలో ఖిజర్ అహ్మద్ యాఫై,అమీమ్ షరీఫ్,ముహమ్మద్ షఫీ,అష్ఫాక్ అహ్మద్,రకీబ్ యాఫై తో కూడిన ప్రతినిధి బృందం ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంది.కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఏ. మాజిద్ సమగ్ర పర్యవేక్షణ చేశారు.రెండు రోజుల శిక్షణా శిబిరంలో జర్నలిస్టులకు నూతన మీడియా ధోరణులు,ప్రొఫెషనల్ ఎథిక్స్, మీడియా లా,ఉర్దూ జర్నలిజం యొక్క భూత - భవిష్యత్తు,పరిశోధనాత్మక జర్నలిజం,మీడియా ట్రాన్స్లేషన్ టెక్నిక్స్,రిపోర్టింగ్ నైపుణ్యాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.శిక్షణా తరగతుల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి వర్కింగ్ జర్నలిస్టుల యొక్క పోరాట చరిత్రను,మీడియా లా కి సంబంధించిన విషయాలను వివరించారు.శిక్షణా తరగతుల్లో మొదటి రోజు ప్రొఫెసర్ ఎస్.ఏ షుకూర్ (ఓయు), ఉడుముల సుధాకర్ రెడ్డి,టైమ్స్ ఆఫ్ ఇండియా,ఇన్వెస్టిగేటివ్ స్టోరీస్ ఎడిటర్, బి షఫీ ఉల్లా,గవర్నమెంట్ సెక్రటరీ మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్,సయ్యద్ ఖలీలుల్లాహ్,ఫార్మర్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్,రెండవ రోజు తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి,డాక్టర్ ముహమ్మద్ ముస్తఫా అలీ సర్వరీ,అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఎంసీజే ఎంఏఎన్ యుయు,షాజీ ఉల్లా ఫిరాసత్,ఎత్తేమాద్ న్యూస్ ఎడిటర్,యాంకర్,సయ్యద్ ఖాలీద్ షహబాజ్,ఆన్లైన్ మీడియా ఎడిటర్ గవాహ్,చివరగా ఫెడరేషన్ అధ్యక్షులు ఎంఏ మాజీద్ మహిళల,చిన్న పిల్లల హక్కులపై జర్నలిస్టుల బాధ్యత గురించి వివరించారు.కార్యక్రమం ముగింపులో పాల్గొన్న ప్రతి జర్నలిస్టుకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి,జర్నలిజం రంగంలో మరింత మెరుగైన సేవలు అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.



# పెన్షన్ విద్రోహ దినం.. నల్ల చొక్కా, నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నిరసన

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

సిరిసిల్ల కలెక్టరేట్ ముందు ఉద్యోగులందరు సోమవారం ఉదయం 10 గంటలకు నిరసన చేపట్టడం జరిగింది. జిల్లాలోని వివిధ సంఘాలు టీజీవో, టీఎన్జీవో ఉపాధ్యాయ, ఉద్యోగుల, పెన్షనర్స్, కార్మిక సంఘాల తదితర నాయకులు పెన్షన్ విద్రోహ దినం పాటించారు. నల్ల చొక్కా, నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నిరసన ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ చైర్మన్ ఎలుసానీ ప్రవీణ్ కుమార్, కన్వీనర్ సమర సేన్, కార్యదర్శులు సయ్యద్ జబి, గాజుల సుదర్శనం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందు పరిచిన అంశం మేరకు సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ మెట్ట శ్రీకాంత్, కోశాధికారి ఎం.డి రియాజ్ పాషా, టీ. జీ. ఒ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ జోగం రాజు, కోశాధికారి అహ్మద్ రసూల్, జాయింట్ సెక్రటరీ బి.శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సాగర్, మహిళ ఉపాధ్యక్షురాలు జానకి, ట్రెసా అధ్యక్షులు జయంత్ కుమార్, ఎ.ఇ.ఇ అధ్యక్షులు ఎం. వెంకట్ రెడ్డి ఎ.ఇ.వో అధ్యక్షులు లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు అనిల్, ఎ.ఎస్.వో అధ్యక్షులు సుమన్, నాలుగో తరగతి జిల్లా అధ్యక్షులు జీవన్, దేవాదాయ శాఖ ఫోరమ్ అధ్యక్షులు ఎడ్ల శివకుమార్, సభ్యులు అధ్యాపకులు. అర్ శేఖర్, గోపి, జయభారత్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సిపియస్ రద్దుకై మహా ధర్నా కు తరలి వెళ్ళిన మండల పిఆర్టియు నాయకులు

సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణ పేట జిల్లా

మండల కేంద్రం నుండి సిపియస్ రద్దుకై సోమవారం హైదరాబాద్ లో జరిగే మహాధర్నాకు నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టియూ కృష్ణ మండల కార్యవర్గ సభ్యులు దాదాపు 45 మంది నల్ల వస్త్రాలు ధరించి బయలుదేరి వెళ్ళారు.ఈ కార్యక్రమంలో కృష్ణ మండల అధ్యక్షుడు దండు శేఖర్, గౌరవ అధ్యక్షుడు నల్లె శివరాజ్, ప్రధాన కార్యదర్శి యం ఆర్ అజయ్, అసోసియేట్ అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి వి.రామకృష్ణ మరియు రాష్ట్ర, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు యన్ ఆశప్ప, పి నరేందర్,కె నర్సిములు,మీనా కూమారి,రేణుక దేవి,బి శ్రీనివాస్,తిమ్మప్ప,పి రాఘవేంద్ర,ఖాశీం అలీ,మోహన్,డి రవి కుమార్,రవితేజ,అనిల్ కుమార్,అశోక్,ఇమామ్ సాబ్ తదితరులు ఉన్నారు..



# బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు పట్ల కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఏకగ్రీవ ఆమోదం పట్ల ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాసేవ భవన్ నుంచి సోమవారం పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ నిర్వహించారు.రేవంత్ రెడ్డికి ప్రభుత్వానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.బీసీ నేతలందరు ప్రభుత్వానికి సీయం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం కాంగ్రెస్ ప్రముఖుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు.బిల్లు ఏకగ్రీవ ఆమోదం పొందడం పట్ల బీసీ లందరూ ఎంతో గర్విస్తున్నారని అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు.ఇది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.ఒక ఓసి ముఖ్యమంత్రి అయి ఉండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయటాన్ని ఆయన స్వాగతించారు.ఇది బీసీ లందరికీ గర్వకారణం అన్నారు.స్పెషల్ ఆర్డినెన్స్ ద్వారా ఖచ్చితంగా స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలై తీరుతుందన్నారు.ఆరు నూరైనా బీసీ బిడ్డలందరికీ న్యాయం జరుగుతుందన్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు సరైన న్యాయం చేసిందన్నారు.42 శాతం రిజర్వేషన్ తో సత్కరించిందన్నారు.ఈ బిల్లు పట్ల కేవలం బీసీలు మాత్రమే కాకుండా ప్రజలందరూ కూడా హర్షిస్తున్నారన్నారు.బిజెపి,బీఆర్ఎస్ లు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే చూశాయని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వాళ్లకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి సరైన న్యాయం చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలు వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెరగాలని, ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన నిర్వహించారు. జిల్లాలో మండలాల వారిగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, మార్కింగ్ చేసిన ఇండ్లు, నిర్మాణం జరుగుతున్న ఇండ్లు, వాటి పురోగతి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి, పలు సూచనలు చేశారు. జిల్లాలో ప్రభుత్వం 8 వేల 811 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 5292 ఇండ్ల మార్కింగ్ జరిగిందని, 2921 ఇండ్లు బేస్మెంట్ స్థాయికి, 146 గోడల దశ వరకు, 451 ఇండ్లు రూఫ్ వరకు 1ఇంటి నిర్మాణం పూర్తి జరిగాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు నియంత్రణలో ఉండేలా మండల స్థాయి ప్రైస్ కమిటీ ద్వారా ధరలు నియంత్రించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు క్యాప్చర్ చేస్తూ ఆన్ లైన్ లో నమోదు చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ తరఫు నుంచి ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చూడాలని, మన దగ్గర పెండింగ్ ఉండకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్, అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఇసుక తీసుకెళ్ళేందుకు కూలీ, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని, జిల్లాలో ఎక్కడైనా 1500 కంటే ఎక్కువ ట్రాక్టర్ ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోనే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మోడల్ స్కూల్స్ లను, అంగన్వాడీ సెంటర్స్,పి. హెచ్ సి, ఎరువుల షాప్స్ రెగ్యులర్ గా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యా సంస్థల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉన్నాయా, నీరు నిల్వ ఉంటుందా, విద్యార్థులకు అందించే ఆహార , త్రాగునీటి నాణ్యత, ఎలా ఉంది వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారులు డైలీ టూర్ డైరీ సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో పిడి హౌసింగ్ శంకర్ రెడ్డి మండల ప్రత్యేక అధికారులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలు వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత

వనపర్తి జిల్లా.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం నర్వ, అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో ఆయా మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థలలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్,మున్సిపాలిటీల ఎన్నికలలో బీజేపీ బలపర్చిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి కష్టపడి పండించిన సన్న వొడ్లకు 500/- రూపాయల బోనస్ ఇవ్వలేని కాంగ్రెస్ నాయకులు, కనీసం ఎకరాకు 2 బస్తాల యూరియాను కూడా సరఫరాచేయలేని అధికార పార్టీ నాయకులు రైతులను ఎం మొఖం పెట్టుకొని ఓట్లడుగుతారని నిలదీశారు.ఓట్ల చోరీకి ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని,గతంలో 13 ఓట్లు పడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ని కాదని, ఒక్క ఓటు పడిన జవహర్ లాల్ నెహ్రూ ప్రధాన మంత్రి అయినప్పుడే ఓట్ల చోరీకి బీజం పడిందని కాంగ్రెస్ నాయకులు ఇది గుర్తించుకొని మాట్లాడాలన్నారు.
కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి డిక్లరేషన్ ని కాదని మైనార్టీలకు,బీసీ లకు కలిపి 42./ రిజర్వేషన్ ఇవ్వాలని అడగడం ఒక డ్రామా అని ఎద్దేవా చేసారు.ఉచితంగా ఇస్తున్న 6 కిలోల బియ్యం రేషన్ కార్డులను పంచుతున్న మీరు 5 కిలోలు కేంద్రానివి, 1 కిలో రాష్ట్రానివి అని లబ్దిదారులకు చెప్పలేని అసమర్థ కాంగ్రెస్ పార్టీకి ఓట్లడిగె నైతిక హక్కు లేదని మాట్లాడారు. ఎన్నికలముందు ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇచ్చిన గ్యారంటీలను గాలికొదిలేసి,హామీలను తుంగలో తొక్కిన మీకు త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఓటరు మహాశయులు గట్టి గుణపాఠం చెబుతారని బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మండిపడ్డారు.ఇట్టి కార్యక్రమంలో మూడు మండలాల బీజేపీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కార్యదర్సులు, జిల్లా కౌన్సిల్ మెంబర్లు, బీజేపీ సీనియర్ నాయకులు, భూత్ అధ్యక్షులు,మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## బిఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్ పాటిల్



సమయజ్యోతి న్యూస్ కృష్ణ...

నారాయణ పేట జిల్లా

మండలంలోని గత వారం రోజుల క్రిందట కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు, కాలువలు ఉప్పొంగి చెరువుల గట్లకు పగుళ్లు వచ్చి కొన్ని చోట్ల చెరువులు కూడా తెగిపోయాయి.చాలా గ్రామాలలో రహదారులు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది మరియు వాహనాల రాక పోకలు స్తంభించిపోయాయి అదేవిధంగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, చెట్లు విరిగి పడడం వలన గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది అని అన్నారు. వర్షాల వలన రైతుల పంటలు నీట మునిగిపోవడం వలన రైతులు ఆర్థికంగా కష్టాల్లోకి వెళ్లారు దీనిని దృష్టిలో ఉంచుకొని మక్తల్ ఎమ్మెల్యే, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మరియు సంబంధిత మంత్రులు వెంటనే చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు.

# ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీల పట్టివేత.. కేసు నమోదు



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

భీమ్గల్ మండలం బెజ్జోరా గ్రామ వాగు నుండి ఆర్మూరుకు ఇసుక తరలిస్తుండగా గోవిందపేట్ గ్రామం, పెర్కిట్ గ్రామంలో ధారంగుల సాయిబు రావ్, (మెట్పల్లి), పల్లెపు రాజన్న (బ్రాహ్మణపల్లి), దేరంగుల వీరన్న ( బ్రాహ్మణపల్లి), దేవల్ల ఎల్లయ్య (మోర్తాడ్), మామిడి మహిపాల్ (బ్రాహ్మణపల్లి), ముద్దంగుల రమేష్ (రామచంద్ర పల్లి), దండుగుల దుర్గయ్య (మునిపల్లి) ల అనుమతి లేని ఇసుక లారీలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లుగా ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# సిహెచ్ సి నూతన భవనాన్ని నిర్మించాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం స్థానంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల బిజెపి అధ్యక్షులు అంబటి నవీన్ డిమాండ్ చేశారు. మహిళా వైద్యురాలిని వెంటనే నియమించాలని అన్నారు. గర్భవతుల ఆరోగ్య పరీక్షల నిమిత్తము, కాన్పుల నిర్వహణకు, నిత్యం వివిధ గ్రామాల నుంచి వచ్చే సుమారు 200 మంది బయటి రోగులు, వైద్యురాలు లేక అవస్థ పడుతున్నారని, కాన్పుల కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని అన్నారు. జిల్లాల అధికారులు స్పందించి వెంటనే వైద్యురాలినీ నియమించాలని డిమాండ్ చేశారు.



# వరద సహాయక చర్యలను అధికారులు పకడ్బందీగా అందించాలి : సీఎం రేవంత్ రెడ్డి

## భారీ వర్షాలు, వరద సహాయం పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎం



సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

వరద సహాయక చర్యలను అధికారులు పకడ్బందీగా అందించాలి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం భారీ వర్షాలు, వరద సహాయం పై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, సీతక్క కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు, హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి అన్న కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో భారీ వరదల కారణంగా దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, కుంటల వివరాలు సేకరించాలని, వీటి మరమ్మత్తు, పునరుద్ధరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదల వల్ల మరమ్మతులకు గురైన పంచాయతీ రోడ్లు, రోడ్లు భవనాల శాఖ రోడ్లు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధుల క్రింద పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. విపత్తుల కారణంగా జరిగిన మానవ ప్రాణ నష్టం, పశువుల ప్రాణ నష్టంకు అందించే పరిహారం సైతం డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు వినియోగించాలని సీఎం అధికారులకు తెలిపారు. వరదల సహాయం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు రాష్ట్రం వద్ద అందుబాటులో ఉన్నాయని చెబుతున్నారని, గత వరదల సమయంలో వినియోగించిన నిధులను పూర్తి స్థాయిలో డిజాస్టర్ మేనేజ్మెంట్ క్రింద జమ చేసి కేంద్రం నుంచి మరింత సహాయం రాష్ట్రానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ నెలాఖరు వరకు డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు యూసీలను సమర్పించాలని సీఎం ఆదేశించారు. గతంలో వరదల సమయంలో పాడైన రోడ్ల మరమ్మత్తు పనులకు ఖర్చు చేసిన నిధులు డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద నమోదు చేస్తూ వివరాలు అందించాలని సీఎం, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆగస్టు నెలలో కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల ఎకరాల పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా లభించిందని, వీటికి పరిహారం అందిం చేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. ఆగస్టు నెలలో కురిసిన వరదల కారణంగా తెలంగాణ రాష్ట్రంలో 732 కోట్ల విలువ గల 1009 కిలో మీటర్ల ఆర్%డ%బీ రోడ్లు, జాతీయ రహదారులు, 374 కోట్ల విలువగల 577 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు, 32 కోట్ల 73 లక్షల విలువ గల విద్యుత్ శాఖ పరికరాలు, 8.95 కోట్ల విలువ గల మిషన్ భగీరథ పైప్ లైన్ లు దెబ్బతిన్నాయని అన్నారు.సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరద సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. వరద సహాయక చర్యలకు కలెక్టర్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని, డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని సీఎం ఆదేశించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అక్కడ వారికి అవసరమైన వైద్యం ఆహారం ఇతర ఏర్పాట్లు చేయాలని అన్నారు. వరదల నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్, ఇతర పరికరాలు ఫీల్డ్ లో సిద్ధం పెట్టుకోవాలని, విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు చేయాలని, మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ లు సన్నద్ధం చేయాలని, ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. వరదల గురించి ప్రజలకు సామాజిక మాధ్యమాల్లో, ఎఫ్.ఎం రేడియో, వివిధ మాధ్యమాల ద్వారా ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, నీటి వనరుల సమాచారం తెలుసుకొని, వాటికి సమీపంలో ఉన్న రోడ్లు వంతెనల పై రాకపోకలను నిలిపివేయాలని, దీని కోసం స్థానిక పోలీస్ అధికారుల సహకారం తీసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ ఆగస్టు 26 నుంచి 28 తేదీలలో భారీ వర్షాలు మన రాష్ట్రంలో కురిసాయని ముఖ్యంగా మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురువడంతో ప్రాథమిక అంచనా ప్రకారం 4124 కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని అన్నారు. జాతీయ రహదారి 44 కు చాలా చోట్ల పెద్ద డ్యామేజీ జరిగిందని అన్నారు.
వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, వరదలలో సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక వ్యక్తి కొట్టుకొని పోయారని ఇప్పటివరకు బాడి దొరకలేదని, సెర్చింగ్ టీమ్స్ ఏర్పాటు చేసి వెతికిస్తున్నామని అన్నారు. 38 ఇండ్లు డామేజ్ అయ్యాయి నష్ట పరిహారం అందించామని, 3 పశు వులు మృతి చెందాయని, పాక్షికంగా రోడ్లు, 561 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డిఓలు వెంకటేశ్వర్లు, రాదాబాయి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని షబ్బీర్ అలీ ఆహ్వానించారు

సమయజ్యోతి, హైదరాబాద్ సోమవారం





తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ (షబ్బీర్ అలీ), కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారిని సోమవారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, మంత్రులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.షబ్బీర్ అలీ మాట్లాడుతూ, 2004లో ఏకీకృత ఆంధ్రప్రదేశ్ సమయంలో సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన ముస్లింలకు రిజర్వేషన్లను సమర్థించిన మొదటి న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారని గుర్తుచేశారు. ఆయన సూచనల మేరకు, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ శాతాన్ని 5% నుండి 4%కి సవరించి, షెడ్యూల్డ్ కులాలపై సుప్రీంకోర్టు విధించిన పరిమితిని పాటించినట్లు తెలిపారు.జస్టిస్ సుదర్శన్ రెడ్డి భారతదేశ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే, అది గర్వకారణం అవుతుందని, ఆయన న్యాయనిష్ఠ, సామాజిక న్యాయం పట్ల కట్టుబాటు దేశానికి ఆదర్శమని షబ్బీర్ అలీ ప్రశంసించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లును గవర్నర్ ఆమోదించాలి

## అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం పట్ల సర్వత్ర హర్షం

## స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ల అమలు కై కాంగ్రెస్ చేస్తున్న కృషికి హాట్సాఫ్

## పార్టీల చిత్తశుద్ధిని బీసీలు గమనిస్తున్నారు

## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు



స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీ చేసిన ఏకగ్రీవ తీర్మానాన్ని గవర్నర్ ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు విజ్ఞప్తి చేశారు.సెప్టెంబర్ 1, 2025 సోమవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశం తడక కమలాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే కసి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండడం పట్ల ఆ ప్రభుత్వానికి, ఆ పార్టీకి హాట్సాఫ్ చెబుతున్నట్లు తెలిపారు.బీసీ రిజర్వేషన్ల విషయమై కొన్ని పార్టీలు గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నాయని, ఈ వ్యవహారం అంతా బీసీ సమాజం గమనిస్తోందని పర్ష హన్మాండ్లు అన్నారు. నిన్న అసెంబ్లీలో 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేస్తూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించడం పట్ల ఈ ప్రభుత్వానికి, అన్ని పార్టీలకు బీసీ సంక్షేమ సంఘం పక్షాన ధన్యవాదాలు తెలిపారు.42 శాతం రిజర్వేషన్లు అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీతక్క, కొండా సురేఖ లకు మా సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పర్ష హన్మాండ్లు పేర్కొన్నారు.ఈ రిజర్వేషన్ల అంశం బీసీలకు నోటికి బుక్కలాగా దగ్గరగా వచ్చిందని, దీన్ని ఎత్తగొట్టే ప్రయత్నం ఎవరు చేసినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఏదైనా జరుగుతుందన్నా, బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని పర్ష హన్మాండ్లు స్పష్టం చేశారు. గతంలో బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు చేయకపోవడం వలన బీసీలు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.జనాభా ప్రమాణాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, అగ్రవర్ణాలకు రాజ్యాధికారం లభించిందని, ప్రస్తుతం 56% జనాభా కలిగిన బీసీలకే అధికారం దక్కాల్సిందని పర్ష హన్మాండ్లు డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని మేము రాజకీయం చేయదలచుకోలేదని, కానీ ఇక ఆలస్యం చేస్తే లేదా ఏదైనా పార్టీ అడ్డుకుంటే తెలంగాణ ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని బీసీ కుల సంఘాలు, బీసీ విద్యార్థులు, బీసీ ఉద్యోగులు, బీసీ నాయకులు, బీసీ మేధావులతో కలిసి రాష్ట్రవ్యాప్త జేఏసీని ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు.

# 2010 కు పూర్వం నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని టిపిస్పిటిఏ డిమాండ్

సమయజ్యోతి, హైదరాబాద్ ఎసెప్టెంబర్ 1, 2025

తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టిపిస్పిటిఏ) ప్రభుత్వం ముందు విజ్ఞప్తి చేసింది. 2010 కు పూర్వం నియమితులైన ఉపాధ్యాయులకు పదోన్నతుల విషయంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) అర్హతను తప్పనిసరి చేయకుండా మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేసింది.రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, అసోసియేట్ అధ్యక్షురాలు ఆర్. మంగా, పి. సుధారాణి లు ఉమ్మడిగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. టెట్ అర్హతను నిర్బంధం చేస్తే సీనియర్ ఉపాధ్యాయుల పదోన్నతులపై తీవ్ర ఆటంకాలు ఏర్పడతాయని, ఉపాధ్యాయుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.సుప్రీంకోర్టు టెట్ అర్హతపై ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి 2010 కు పూర్వం నియమితులైన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, దానిని కేంద్రానికి పంపించి ఆమోదం పొందాలని సంఘం కోరింది.మినహాయింపు ఇవ్వని పక్షంలో సీనియర్ ఉపాధ్యాయులు పదోన్నతులు పొందకపోవడమే కాకుండా పదవీ విరమణ వరకు ఎదుగుదల లేకుండా ఉండాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టిపిస్పిటిఏ నేతలు విజ్ఞప్తి చేశారు

# సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) అంతం అయ్యేదాకా ఉపాధ్యాయ సంఘాల పోరాటం ఆగదు

సమయజ్యోతి, సంగారెడ్డి సెప్టెంబర్ 1, 2025

పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు చేసి ఓపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం) పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేశాయి.2004 సెప్టెంబర్ 1 నుండి ప్రభుత్వ ఉత్తర్వులు 654 మరియు 655 ఆధారంగా అమలులోకి వచ్చిన సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులపై భారంగా మారిందని నాయకులు పేర్కొన్నారు. ప్రతి నెలా ఉద్యోగుల జీతం నుండి 10 శాతం కోత విధించి, అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమచేసినా, ఆ మొత్తాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతారని, దాంతో ఉద్యోగుల పెన్షన్ భవిష్యత్తు మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. సిపిఎస్ కింద రిటైర్ అయ్యే ఉద్యోగులకు కేవలం రెండు నుంచి మూడు వేల రూపాయల తక్కువ పెన్షన్ మాత్రమే వస్తోందని, రిటైర్మెంట్ తర్వాత వారి పరిస్థితి దయనీయంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గత 24 ఏళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిపిఎస్ వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సంఘాలు విమర్శించాయి. ఇప్పటికే మూడు రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసి ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ఓపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం) అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో కూడా సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీ మరిచిపోయిందని ఆక్షేపించారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం జరుపుకుంటూ పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ కోసం ఉద్యమాలు చేసినా ప్రభుత్వాలు స్పందించకపోవడం దురదృష్టకరమని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి. సిపిఎస్ అంతం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని వారు హెచ్చరించారు.




# ఎల్లారెడ్డిపేట మండల బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధిగా దండు శ్రీనివాస్ నియామకం

సమయజ్యోతి, ఎల్లారెడ్డిపేట, రాజన్న-సిరిసిల్ల జిల్లా:

ఎల్లారెడ్డిపేట మండలం, రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్ ఎల్లారెడ్డిపేట మండల బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను సోమవారం రోజున సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు జారీ చేశారు.ఈ బాధ్యతను దండు శ్రీనివాస్‌కు అప్పగించడం ద్వారా, బీసీ సంఘ అభివృద్ధి కోసం ఆయన సమర్థవంతంగా కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో దండు శ్రీనివాస్ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రతినిధి పర్ష హన్మాండ్లు, స్థానిక నాయకులు కంచర్ల రాజు, బండారు బాల్రెడ్డి, తడక కమలాకర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



# నోటీసులపై మరో వారం గడువు కోరాం: కడియం

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

మాకు మరో వారం రోజుల గడువు ఇవ్వండి అని ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కోరారు. కడియం శ్రీహరి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ నుంచి తమకు నోటీ-సు వచ్చింది వాస్తవమేనని అన్నారు. సెప్టెంబర్ 2వ తేదీలోగా నోటీసుకు సమాధానం ఇవ్వాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే ఈ గడువు సరిపోదని, ఈ గడువు తర్వాత కూడా తమకు అదనంగా మరో వారం రోజుల సమయం ఇవ్వాలని కోరగా అందుకు స్పీకర్ సమ్మతించారని ఆయన చెప్పారు. ఈ గడువులో తాము సమాధానం ఇస్తామని కడియం తెలిపారు.పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. రాజ్యాంగంలోని పదవ షెడ్యూలు ప్రకారం ఫిరాయించిన ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలను రద్దు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ ఒకవైపు స్పీకర్‌కు నోటీ-సు ఇవ్వడం, మరోవైపు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీ-వల ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సమాధానం తెలియజేయాలంటూ నోటీసు పంపించారు.

# కాళేశ్వరంపై సిబిఐ విచారణ శాసనమండలిలో బిఆర్ఎస్ ఆందోళన

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఇవ్వడాన్ని నిరసరగా శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన నిర్వహిస్తున్నారు. చైర్మన్ పోడియాన్ని ముట్టడించిన ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తున్నారు. మండలి కార్యకలాపాలను అడ్డుకున్నారు. జై తెలంగాణ నినాదాలతో మండలిని హోరెత్తించారు. కాళేశ్వరం నివేదిక ప్రతులను చించి చైర్మన్‌పైకి విసిరి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్‌కు సీబీఐ వద్దు, రేవంత్‌కు సీబీఐ ముద్దు, రాష్ట్రాన్ని బాగుచేస్తే సీబీఐ కేసులా.. సిగ్గుసిగ్గు, బడేభాయ్.. చోటేభాయ్ ఏక్ హై.. కాళేశ్వరం రిపోర్ట్ ఫేక్ హై, వియ్ వాంట్ జస్టిస్ అంటూ అంటూ నినాదాలు చేసారు.

# బిసి బిల్లుకు మండలి ఆమోదం

## బిఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్య ముగిసిన మండలి

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

తెలంగాణ శాసనమండలలో సోమవార బీఆర్ఎస్ సభ్యుల గందరగోళం నడుమ నాలుగు బిల్లులను మండలి ఆమోదించింది. ఆ తరవాత నిరవధికంగా వాయిదా పడింది. మొదటగా బీసీ బిల్లుపై చర్చించి ఆమోదం తెలిపింది. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్టసవరణ, పురపాలక సంఘాల చట్టసవరణ, అల్లోపతిక్ ప్రైవేటు- వైద్య సంరక్షణ సంస్థల చట్టం రద్దు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసనల మధ్యనే మండలిలో నాలుగు బిల్లులు ఆమోదం పొందాయి. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. చైర్మన్ పోడియం దగ్గర బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో శాసనమండలిలో కొంత గందరగోళ వాతావరణం నెలకొంది. కాళేశ్వరం కమిషన్ నివేదిక పేపర్లు చింపి మండలి చైర్మన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి సీబీఐ వద్దు.. రేవంత్‌కు సీబీఐ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం వద్ద నిరసన వ్యక్తం చేయొద్దని.. వారికి కేటాయించిన స్థానాల్లోనే నిరసన వ్యక్తం చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసనలతో శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. శాసనమండలిలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ సభ్యులపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జై తెలంగాణ నినాదాలు చేసే అర్హత బీఆర్ఎస్‌కు లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారతీయ రాష్ట్ర సమితిగా మార్చినప్పుడే తెలంగాణతో టీఆర్ఎస్ బంధం తెగిపోయిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజలను అడుగడుగునా మోసం చేసిన టీఆర్ఎస్‌కు తెలంగాణ మాట పలికే అర్హత కోల్పోయిందని మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు.

# వారు కోరినట్లే సిబిఐ విచారణ

## నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత బిజెపిదే

## పిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు,ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు దీన్ని నమ్మినందుకే భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని గద్దెదించారని చెప్పారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే విచారణను సీబీఐకి అప్పగించాం. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కేసీఆర్ మొహం చాటేశారు. బీసీ బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోంది. భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. మండలిలో బీసీ బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీలు నానా హంగామా చేశారు. భాజపా తరహాలోనే ఆ పార్టీ కూడా బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ కెసిఆర్ కుటు-ంబ అవినీతిని బయట పెట్టిందని అన్నారు. బిజెపి డిమాండ్ చేసినట్టే కాళేశ్వరంపై విచారణ సిబిఐకి అప్పగించామని, కాళేశ్వరంపై సిబిఐ విచారణ పూర్తి చేసి బిజెపి నిబద్ధత చాటుకోవాలని సూచించారు. 42 శాతం బిసి రిజర్వేషన్లను బిఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిన మాట వాస్తవం కాదా? అని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ అవినీతిని ప్రజలు నమ్మారు కాబట్టే వారిని గద్దె దించారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రైవేట్ ఫామ్ హౌజ్‌కు ధన్‌ఖడ్

## అధికారిక నివాసం ఖాళీచేసినట్లు వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(సమయజ్యోతి)

ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ దాదాపు ఆరు వారాల తర్వాత తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. ఈ క్రమంలోనే దక్షిణ ఢిల్లీలో ఛతర్‌పూర్ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు అధికారిక నివాసం కేటాయించే వరకు తాత్కాలికంగా అక్కడ ఉంటారని అధికారులు తెలిపారు. ఆ ఫామ్‌హౌస్ ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలాకు చెందినదిగా తెలుస్తోంది. ఆరోగ్య కారణాలు చూపుతూ.. జులై 21న జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి ప్రజాజీవితానికి దూరంగా ఉంటు-న్నారు. ఆయన ఇప్పటివరకు పార్లమెంట్ హౌస్ సమీపంలోని ఉపరాష్ట్రపతి భవనంలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన తన సమయాన్ని కుటు-ంబ సభ్యులతో గడుపుతున్నారని, టేబుల్ -టె-న్నిస్ ఆడుతున్నారని, యోగా సాధన చేస్తున్నారని ధన్‌ఖడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇటీ-వల ఆయన మాజీ ఎమ్మెల్యే పింఛనుకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ధనఖడ్ గతంలో రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1993 ఎన్నికల్లో కిషన్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరపున విజయం సాధించారు. ఆ సమయంలో రూల్స్ కమిటికీ సభ్యుడిగానూ పనిచేశారు. నిబంధనల ప్రకారం.. రాజస్థాన్ మాజీ ఎమ్మెల్యేలు రూ.35వేల పింఛనుకు అర్హులు.

# సిబిఐ విచారణకు భయపడేది లేదు

## -రాహుల్ వద్దన్న సిబిఐ రేవంత్‌కు ముద్దు-ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

## -గోదావరి జలాలపై బాబుతో కలసి కుట్ర -మీడియా తో రేవంత్‌పై మండిపాటు

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నివేదికను ఆదివారం ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రభుత్వ, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఈ కేసును సిబిఐకి అప్పగిస్తామని అన్నారు. అయితే ఈ విషయంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ మండిపడ్డారు . 'ఎక్స్' వేదికగా ఆయన సిఎం రవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సెటర్లు వేశారు. తెలంగాణలో కరెన్సీ మేనేజర్(సిఎం) కాళేశ్వరం కేసును సిబిఐకి అప్పగిస్తారట. గతంలో రాహుల్ గాంధీ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలను అంతం చేసే సెల్స్ అని అన్నారు. మిస్టర్ గాంధీ మీకు తెలుసా.. మీ సిఎం ఏం చేస్తున్నారో..? ఇలా ఎంత బెదిరించినా.. భయపడేది లేదని.. రాజకీయంగా, న్యాయపరంగా పోరాటం చేస్తాం. ప్రజలపై, న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉందని కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.దీంతో పాటు గతంలో రాహుల్ చేసిన పోస్ట్‌కి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను ఆయన జత చేశారు. ఇదిలావుంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ సాకుతో చంద్రబాబు, మోదీలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, బీఆర్ఎస్ మీదనే దాడి జరగడం లేదన్న కేటీఆర్.. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి మన గోదావరి జలాలను ఆంధ్రకు తరలించే కుతంత్రాలకు ఆ ముగ్గురు తెరతీశారని మీడియా వద్ద విమర్శించారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్‌లను లేకుండా చేసి తెలంగాణపై తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టు-కునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీ-ఆర్ మండిపడ్డారు. మోదీ, చంద్రబాబు ఎజెండా మేరకు బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని, ఇక్కడి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించడం అంటే ప్రాజెక్టును పూర్తిగా ఎండబెట్టడమేనని అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ- సంస్థలను మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్.. 48 గంటల్లోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అంతా కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికార బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం మోదీ ప్రాపకం కోసం వాటిని ఉపయోగించు కుంటు-న్నారని విమర్శిం చారు. రాహుల్ గాంధీకి చేదుగా అనిపించిన సీబీఐ, రేవంత్‌కు మాత్రం ముద్దొస్తుందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కోరగానే సీబీఐకి అప్పజెప్పడం ఆ రెండు పార్టీల అక్రమ బంధానికి సాక్ష్యం అని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, బంగారు తెలంగాణ నిర్మాతగా చరిత్ర సృష్టించిన కేసీఆర్ మీద విష ప్రచారం చేయాలన్న దుర్మార్గ, రాక్షస ఆలోచనతో రేవంత్ ఉన్నాడని కేటీ-ఆర్ విరుచుకుపడ్డారు. గతంలో



ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలినా, సుంకిశాలలో సైడ్ వాల్ కూలినా, వట్టెం పంప్ హౌజ్ కూలిపోయినా, పెద్దవాగు రెండుసార్లు కొట్టుకుపోయినా కేంద్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదని కేటీ-ఆర్ గుర్తుచేశారు. అప్పుడు రాని జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ-మేడిగడ్డ రెండు పిల్లర్లు కుంగితే మాత్రం ఆగమేఘాల మీద వచ్చి తలాతోకలోని రిపోర్ట్ ఇచ్చిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి మీద ఈగ కూడా వాలకుండా ప్రధాని మోదీ కాపాడుతున్న సంగతిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. పద్నాలుగేళ్ల ఉద్యమంలో, పదేళ్ల ప్రగతి ప్రస్థానంలో, రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్షంగా తెలంగాణ ఏకైక గొంతుకగా నిలుస్తున్న కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని అణచివేసే కుట్రలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందన్నారు. సీబీఐకే కాదు, ఏ ఏజెన్సీకి కాళేశ్వరం విచారణ అప్పచెప్పినా బీఆర్ఎస్ పార్టీ భయపడదని చెప్పారు. బీజేపీతో కలిసి కాంగ్రెస్ చేస్తున్న ఈ కుట్రలను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. న్యాయస్థానాలపైన తమకు సంపూర్ణ నమ్మకం ఉందన్న కేటీఆర్.. అక్కడ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. బెదిరింపులు, కేసులు తమకు కొత్త కాదని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎన్ని పోరాటాల-కై-నా, ఎలాంటి త్యాగాల-కై-నా సిద్ధమేనని స్పష్టంచేశారు.

# ప్రమాదంలో భారత ఎన్నికల ప్రక్రియ

## -ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ-నేను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదు

## -గతంలో తన తీర్పులను సమర్థించుకున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

భారతదేశంలో ఎన్నికల పక్రియ ప్రమాదంలో పడబోతోందని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల సంఘం అత్యున్నతమైన వ్యవస్థ అని ఉద్ఘాటించారు. సోమవారం తాజ్ కృష్ణాలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. తాను ఇండియా కూటమి అభ్యర్థిని కాదని.. ప్రతిపక్షాల అభ్యర్థినని సుదర్శన్ రెడ్డి నొక్కిచెప్పారు. తాను ఏ పార్టీ సభ్యత్వం స్వీకరించనని స్పష్టం చేశారు. తనపై ఏవేవో ముద్రలు వేస్తున్నారని... అస్సలు బాధగా లేదని చెప్పుకొచ్చారు. తనపై విమర్శలు చేస్తే ఉప రాష్ట్రపతి ఎన్నికల పోటీ నుంచి వెనక్కు తగ్గనని తెలిపారు. తనను విమర్శిస్తే ఈ ఎన్నికల పోటీ- నుంచి వెనక్కు తగ్గి సైలెంట్ అయిపోతానని కొంతమంది అనుకున్నారని పేర్కొన్నారు. తనను విమర్శించే వారు తాను ఇచ్చిన తీర్పు ఒక్కసారి చదవాలని సూచించారు. కోర్టు తీర్పుల గురించి మాట్లాడేవారు వాటిని చదివి మాట్లాడాలని కోరారు. అది తన తీర్పు కాదని.. కోర్టు తీర్పు అని ఉద్ఘాటించారు. తన తీర్పును 11 మంది న్యాయమూర్తులు చదివారని... అందులో ఒక్క విషయాన్ని కూడా మార్చలేకపోయారని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సల్వా జుడంపై తీర్పు సందర్భంగా హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని ఆయన మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలు మసకబారుతున్న సందర్భంలో ప్రతి ఒక్కరూ మాట్లాడాల్సిన అవసర ముందన్నారు. ఓటు- వేసే ప్రతి పౌరుడు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ అభిప్రాయాన్ని కలిగి ఉంటారని అన్నారు. నేను ప్రతి ఎన్నికల్లో పాల్గొని నా ఓటు-హక్కు వినియోగించుకున్నాను. పౌరహక్కులు, సామాజిక న్యాయం,



ఆదేశిక సూత్రాల గురించి నేను మాట్లాడుతాను. రాజకీయ ముళ్లకిరీటం ఎందుకు నెత్తిన పెట్టుకున్నారని కొందరూ అడుగుతున్నారు. వాళ్లందరికీ రాజ్యాంగాన్ని పట్టుకొని సమాధానం చెబుతున్నాను. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయపరమైన పదవి కాదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఐదుసార్లు రాజ్యాంగంపై నేను ప్రమాణం చేశాను. రాజ్యాంగానికి లోబడి ఉండటమే కాదు,



# కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బిఆర్ఎస్‌దే బాధ్యత

## -సిబిఐ విచారణకు బిజెపి ముందునుంచే డిమాండ్-ఆలస్యంగా అయినా స్పందించిన ప్రభుత్వం

## -కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య-22 నెలల పాటు నిర్లక్ష్యం చేశారన్న లక్ష్మణ్

హైదరాబాద్,సెప్టెంబర్1(సమయజ్యోతి):

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతికి బిఆర్ఎస్ బాధ్యత వహించాలని బిజెపినేత కేంద్రమంత్రి బండిసంజయ్ తెలిపారు. కాళేశ్వరంపై బిజెపి వైఖరే నిజమని మరోసారి రుజువైందని అన్నారు. బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై బిజెపి సిబిఐ విచారణను కోరిందని, కాంగ్రెస్ మాత్రం బిఆర్ఎస్ ను కాపాడుతూ ఆలస్యం చేసిందని విమర్శించారు. నిజానికి తలవంచి సిబిఐకి ఫోన్ ట్యాపింగ్ కేసు అప్పగింతకు అంగికరించారని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే సిబిఐకి లేఖ ఇవ్వాలని బండి సూచించారు. గతంలో ఒఆర్ఆర్ టోల్ -టెండర్లపై కాంగ్రెస్ సిట్ ను ప్రకటించిందని, అది నేటికి ఆచరణ రూపంలోకి రాలేదని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం డైలీ సీరియల్ లా కొనసాగుతోందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ వైఖరే నిజమని మరోసారి రుజువైందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. కాళేశ్వరం అవినీతికి బీఆర్ఎస్ పూర్తి బాధ్యత వహించాలని కోరారు. కాళేశ్వరం అవినీతికి ముమ్మాటికీ బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. కాళేశ్వరం అవినీతిపై బీజేపీ సీబీఐ విచారణను తొలిసారిగా కోరిందని గుర్తుచేశారు బండి సంజయ్ కుమార్. కాంగ్రెస్ మాత్రం బీఆర్ఎస్‌ను కాపాడుతూ ఆలస్యం చేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీబీఐకి లేఖ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 22 నెలలు రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం చేసిందని.. తీరా ఇప్పుడు సీబీఐకి ఇచ్చారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం కేసు సీబీఐకి ఇవ్వాలని మొదటి నుంచి బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి ఆధారాలతో సీబీఐకి సహకరించాలని సూచించారు. తెలంగాణ ప్రజల ధనాన్ని బీఆర్ఎస్ నేతలు మెక్కినదంతా కక్కించాలని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ కాళేశ్వరం అవినీతిలో లేరనే విషయాన్ని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై గౌరవం లేకుండా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడతారని ధ్వజమెత్తారు. ఎన్నికల కమిషన్‌పై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. కేసీఆర్‌తో రేవంత్ కుమ్మక్కు వలనే సీబీఐ విచారణను ఆలస్యం చేశారని ఆరోపించారు. విధిలేని పరిస్థితుల్లోనే రేవంత్ రెడ్డి.. కాళేశ్వరాన్ని సీబీఐకు అప్పగించారని చెప్పుకొచ్చారు. 22నెలలు ఎందుకు ఆలస్యం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలిని నిలదీశారు. సీబీఐ విచారణపై మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించటం లేదు? అని ప్రశ్నించారు. గుమ్మడికాయల దొంగ అంటే.. కేటీ-ఆర్ భుజాలు తడుముకుంటు-న్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు అహం తగ్గలేదని.. ప్రజలు ఓడించినా బుద్ధి రావటం లేదని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై అన్ని ఆధారాలున్నాయని పీసీసీ హోదాలో రేవంత్ అన్నారని గుర్తుచేశారు. అన్ని ఆధారాలను రేవంత్ రెడ్డి సీబీఐకు ఇవ్వాలని సూచించారు. తెలంగాణ సంపను దోచుకున్న వారిని ఖచ్చితంగా శిక్షించాలని హెచ్చరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడే అర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు.



# 7 గంటల 19 నిమిషాలపాటు జరిగిన బాక్సింగ్ మ్యాచ్110 రౌండ్ల పాటు కొనసాగిన అతిపెద్ద ఫైట్

క్రీడా ప్రపం చం లోనే ఎప్పటికీ చెరిగిపోని రికార్డులు కొన్ని ఉంటాయి. అందులో 1893లో న్యూ ఆర్లియన్స్ వేదికగా జరిగిన బాక్సింగ్ మ్యాచ్ మొదటిస్థానంలో ఉంటుంది. న్యూ ఆర్లియన్స్ వేదికగా జరిగిన ఆ పోరు బాక్సింగ్ హిస్టరీలో అతిపెద్ద మ్యాచ్?గా నిలిచిపోయింది. బాక్సింగ్ రింగ్?లో రెండు లేదా కష్టం మీద మూడు గంటలు బాక్సర్లు ఫైట్ చేస్తారు. కానీ న్యూ ఆర్లియన్స్ మ్యాచ్? మాత్రం ఏకధాటిగా 110 రౌండ్ల పాటు సాగింది. దాదాపు 7 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌ను ప్రేక్షకులు చాలా ఉత్కంఠతో అలానే చూడసాగారు. ఈ మ్యాచ్?లో బాక్సింగ్? రింగ్‌లో తలపడ్డది అమెరికాకు చెందిన ఆండీ బోవెన్, చికాగోకు చెందిన జాక్ బర్క్. బోవెన్ అప్పట్లో వరల్డ్ లైట్‌వెయిట్ ఛాంపియన్. అతని శరీర నిర్మాణం చిన్నదే అయినా, తెగింపు, స్టామినా అతని పెద్ద ఆయుధాలు. మరోవైపు బర్క్ ఫాస్ట్ మువ్‌మెంట్స్‌తో ప్రత్యర్థులను అటకెక్కించే స్టైల్ కలిగిన బాక్సర్. మొదట బోవెన్‌కు వేరొక బాక్సర్‌తో పోటీ ఖరారైంది. కానీ ఆ బాక్సర్ తప్పుకోవడంతో బర్క్ రింగ్‌లోకి దిగాడు.ఈ గేమ్?లో వీరిద్దరు ప్రత్యర్థులుగా మారారు. 1893 ఏప్రిల్ 6న న్యూ ఆర్లియన్స్‌లో ఈ మ్యాచ్ జరిగింది. ప్రారంభంలో ఇరువురూ దూకుడుగా పోరాడారు. కానీ ఒక్కో రౌండ్ గడుస్తుండగా అలసట మొదలైంది. అయినప్పటికీ ఆ జోష్?లో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఆపలేదు. ఒకొకటిగా రౌండ్స్? పెంచుకుంటూ చివరికి 110 రౌండ్ల వరకు పోరు హోరాహోరీగా సాగింది. అంత సేపు పోరాడిన తర్వాత ఇద్దరికీ నిలబడే శక్తి లేకపోవడంతో, కుర్చీలో కూర్చున్నారు. అదే స్థితిలో మ్యాచ్ ముగిసింది. మొదట నో-కాంటెస్ట్‌గా ప్రకటించగా, తర్వాత ఈ గేమ్ డ్రా గా రికార్డు అయ్యింది. ఈ పోరులో బర్క్ రెండు చేతుల్లో ఎముకలన్నీ విరిగిపోయేంతగా ఆడి గాయపడ్డాడు. ఆరు వారాలపాటు పూర్తిగా బెడ్? రెస్ట్? తీసుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆ తరువాత కూడా తన బాక్సింగ్ కెరీర్?ను కొనసాగించాడు. మరోవైపు బోవెన్ మాత్రం తన కెరీర్‌ను కొనసాగించిన నాలుగేళ్లకే కొన్ని కారణాల వల్ల ప్రాణాలు కోల్పోయాడు. 1897లో జార్జ్ లావిగ్నేతో పోటీలో ఒక దెబ్బకు పడిపోయిన బోవెన్ మళ్లీ లేచి నిలబడలేక పోయాడు.జాక్ బర్క్ 1869 జనవరి 1లో చికాగోలో జన్మించాడు. మొత్తం 12 పోటీల్లో 5 విజయాలు సాధించాడు. 1913లో 44 ఏళ్ల వయసులో కన్నుమూశాడు. ఆండీ బోవెన్ - 1867 మే 3న జన్మించిన బోవెన్, 1887లో బాక్సింగ్ రంగంలోకి వచ్చాడు. తొలి 14 పోటీల్లో ఓటమి చూడలేదు. 1890లో వరల్డ్ టైటిల్ గెలుచుకున్నాడు. కానీ 1897లో జరిగిన పోటీలో ప్రాణాలు కోల్పోయాడు.ఇప్పటి బాక్సింగ్‌లో 12 రౌండ్లు అంటేనే చాలా కష్టంగా అనిపిస్తుంది. కానీ ఆ కాలంలో 110 రౌండ్ల వరకు పోరాడటం నిజంగా అద్భుతం. ఈ మ్యాచ్ ఇప్పటికీ బాక్సింగ్ చరిత్రలో లాంగెస్ట్ బాక్సింగ్ రికార్డ్?గా రికార్డు బుక్‌లో నిలిచిపోయింది.



# రాహుల్ ద్రవిడ్‌ను జట్టు నుండి వెళ్లగొట్టారు


## ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు

రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి రాహుల్ ద్రవిడ్ తప్పుకోవడంపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఫ్రాంచైజీలో మరింత ఉన్నతమైన పదవిని ఆఫర్ చేసినా ద్రవిడ్ స్వీకరించలేదని రాజస్థాన్ రాయల్స్ చెప్పినా.. నెటిజన్లు నమ్మడం లేదు. ద్రవిడ్ నిర్ణయాలకు ఫ్రాంచైజీ విలువ ఇవ్వకపోవడంతోనే అతను ఈ నిర్ణయం తీసుకున్నాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌తో నెలకొన్న విభేదాలు కూడా కారణమని కామెంట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ సంచలన వ్యాఖ్యలు చేశాడు.రాజస్థాన్ రాయల్స్ జట్టులో నుంచి రాహుల్ ద్రవిడ్‌ను పొమ్మన లేక పొగ బెట్టారని తెలిపాడు. వచ్చే సీజన్ నాటికి కొత్త ఆలోచనలతో రాజస్థాన్ రాయల్స్ సిద్ధమవుతుందని, అందుకు అడ్డుగా ఉన్న రాహుల్ ద్రవిడ్‌కు అత్యున్నత పదవి ఆఫర్ చేసి జట్టుకు దూరం చేయాలనుకున్నదని అభిప్రాయపడ్డాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ద్రవిడ్ వ్యవహారంపై మాట్లాడిన ఏబీడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'ఫుట్‌బాల్ లీగుల్లో ఆటగాళ్లతో పాటు కోచ్‌లు, మేనేజర్లు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉంటారు. అత్యుత్తమ ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలవాలని భావిస్తారు. అలా జరగకపోతే మాత్రం అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు వస్తాయి. అలాగే టీమ్‌మేనేజ్‌మెంట్ నుంచి కూడా సూటి పోటీ మాటలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాహుల్ ద్రవిడ్ విషయంలో ఏం జరిగిందో తెలియదు. నాకు తెలిసిన సమాచారం ప్రకారం అతనికి వేరే బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ భావించింది. అయితే అందుకు ద్రవిడ్ అంగీకరించలేదు.అంటే అతన్ని హెడ్ కోచ్ పదవి నుంచి తప్పించాలని రాజస్థాన్ రాయల్స్ భావించింది. వచ్చే సీజన్ నాటికి కొత్త ఆలోచనలతో రావాలని రాజస్థాన్ భావిస్తుందేమో. అందుకోసం తమ కోచింగ్ టీమ్‌లో మార్పులకు శ్రీకారం చుట్టి ఉండొచ్చు. డగౌట్‌కు దూరం కావడం అతనికి ఇష్టం లేకపోవడం కూడా సమస్యగా మారి ఉంటుంది. అసలేం జరిగిందో ఇప్పుడు తెలియకున్నా.. భవిష్యత్తులో తప్పకుండా తెలుస్తుంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ వ్యూహాలు గొప్పగా లేవు. కొన్నిసార్లు మార్పులు కలిసొస్తాయి. కానీ ఈసారి రాజస్థాన్‌కు నష్టమే ఎక్కువ కలిగింది. ఒకరిద్దరిని మారిస్తే ఇబ్బందేమి ఉండదు. కానీ, బల్క్‌గా ఆటగాళ్లను తీసేయడమనేది చాలా ప్రభావం చూపించింది.'అని ఏబీడీ అభిప్రాయపడ్డాడు.

# క్వార్టర్స్ చేరిన అల్కరాజ్, జకోవిచ్, సబలెంకా!



ప్రతిష్టాత్మక గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో టాప్ సీడ్ ఆటగాళ్లు కార్లోస్ అల్కరాజ్, నోవాక్ జకోవిచ్, టేలర్ ఫ్రిట్జ్, అరీనా సబలెంకా, జెస్సికా పెగులా క్వార్టర్ ఫైనల్ చేరారు. జర్మనీ స్టార్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు మాత్రం బిగ్ షాక్ తగిలింది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4, 6-7(7/9), 4-6, 4-6 తేడాతో 25వ సీడ్ ప్లేయర్ ఫెలిక్స్ అలియాసిమ్(కెనడా) చేతిలో ఓటమిపాలయ్యాడు. తొలి సెట్ గెలిచి శుభారంభం చేసిన జ్వెరెవ్ ఆ తర్వాత తడబడ్డాడు. అనవసర తప్పిదాలతో ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం కల్పించాడు. దాంతో వరుసగా మూడు సెట్లు నెగ్గిన అలియాసిమ్.. జ్వెరెవ్‌పై సంచలన విజయాన్నందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అలియాసిమ్ 10 ఏస్‌లతో పాటు 50 విన్నర్లు కొట్టాడు. మరో మ్యాచ్‌లో 7వ సీడ్, సెర్బియా దిగ్గజం నోవాక్ జకోవిచ్ 6-3, 6-3, 6-2 తేడాతో జర్మనీకి చెందిన క్వాలిఫైయర్ జెన్-లెనార్డ్ స్ట్రఫ్‌పై సునాయస విజయాన్నందుకున్నాడు. గంట 50 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో జకోవిచ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. సర్వీస్‌లను సులభంగా గెలుచుకుంటూ ముందుకు సాగాడు.జకోవిచ్ ముఖ్యంగా తన రిటర్న్ గేమ్ మీద ఫోకస్ పెట్టాడు. స్ట్రఫ్ సర్వీస్‌ను చాలాసార్లు బ్రేక్ చేసిన జకోవిచ్.. స్ట్రఫ్‌ను ఏ దశలోనూ కోలుకోనివ్వలేదు. ఇక స్ట్రఫ్ పవర్‌ఫుల్ ఫోర్‌హ్యాండ్, సర్వీస్‌తో జకోవిచ్‌ను ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించినా.. జకోవిచ్ తన డిఫెన్స్, వ్యూహాత్మక షాట్‌లతో వాటిని తిప్పికొట్టాడు. ఈ మ్యాచ్‌లో జకోవిచ్ 6 ఏస్‌లు, 32 విన్నర్లు కొట్టగా..



2 డబుల్ ఫాల్ట్స్, 15 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు స్ట్రఫ్ 10 ఏస్‌లతో పాటు 28 విన్నర్లు కొట్టాడు. 4 డబుల్ ఫాల్ట్స్, 35 అనవసరం తప్పిదాలు చేశాడు.స్పెయిన్ స్టార్, రెండో సీడ్ కార్లోస్ అల్కరాజ్ 7-6 (3), 6-3, 6-4 తేడాతో ఫ్రెంచ్ ప్లేయర్ ఆర్థర్ రిండర్‌క్నెచ్‌పై విజయం సాధించాడు. 2 గంటల 15 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొలి సెట్‌లో కొద్దిగా పోటీ ఎదురైనప్పటికీ టై-బ్రేక్‌లో ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. పవర్‌ఫుల్ ఫోర్ హ్యాండ్ షాట్స్‌తో పాటు వేగవంతమైన కదలికలతో ప్రత్యర్థిని నిలవరించాడు. చాలా సునాయసంగా రెండో, మూడో సెట్‌లను గెలుచుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 7 ఏస్‌లు, 41 విన్నర్లు కొట్టాడు. 4 డబుల్ ఫాల్ట్స్‌తో పాటు 24 అనవసర తప్పిదాలు చేశాడు. మరో మ్యాచ్‌లో టెలర్ ఫ్రిట్జ్ (4వ సీడ్) 6-4, 6-3, 6-3 తేడాతో టామ్స్ మాచక్‌పై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధించాడు.





# ఫిట్‌నెస్ టెస్టు పాసైన రోహిత్ శర్మ

టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, టెస్టు సారథి శుభ్‌మన్ గిల్ ఫిట్‌నెస్ టెస్టు క్లియర్ చేశారు. BCCIబెంగళూరు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్?లో తాజాగా నిర్వహించిన ప్రీ-సీజన్ ఫిట్?నెస్ టెస్టులో రోహిత్, గిల్ పాసయ్యారు. ఈ ఇద్దరితోపాటు యశస్వీ జైస్వాల్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్ కూడా ఫిట్ నెస్? టెస్టులో పాసైనట్లు తెలుస్తోంది. ఈ ఫిట్?నెస్ టెస్టింగ్?లో యోయో టెస్టుతోపాటు DXA స్కాన్ ఫిట్?నెస్ కూడా పాసయ్యారు. యోయో ఫిట్?నెస్ కోసం కాగా, DXA స్కాన్ ఎముకల బలాన్ని పరీక్షిస్తుంది. యోయో సమయంలోనే ఈ పరీక్ష కూడా కంప్లీట్ అయ్యింది.దీంతో ఈ ప్లేయర్లకు 2025 ఆసియా కప్ టోర్నమెంట్?కు లైన్ క్లియర్ అయ్యింది. రోహిత్, శార్దుల్ ఠాకూర్ మినహా, మిగిలిన ఆటగాళ్లు త్వరలోనే ఆసియా కప్ కోసం దుబాయ్?కు ప్రయాణం కానున్నారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 09న ప్రారంభం కానుంది. ఇక రోహిత్ టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కారణంగా అతడు మరికొద్ది రోజులు సెంటర్ ఫర్ ఎక్సలెన్స్?లోనే ఉండనున్నాడు. అయితే, జ్వరం కారణంగా శుభ్?మన్ గిల్ ఇటీవల దులీప్ ట్రోఫీ నుంచి వైదొలిగాడు. జ్వరం కారణంగా టోర్నీ ప్రారంభానికి ముందే దూరమయ్యాడు. దీంతో గిల్?కు ఫిట్?నెస్ పరీక్ష క్లియర్ చేయడం కీలకం అయ్యింది. ఈ క్రమంలోనే తాజాగా ఫిట్?నెస్ నిరూపించుకున్నాడు. ఈ టెస్టు క్లియర్ అవ్వడంతో గిల్ ఆసియా కప్‌లో ఆడనున్నాడు. ఈ టోర్నీలో గిల్ వైస్ కెప్టెన్ హోదాలో బరిలోకి దిగనున్నాడు.ఇక జైస్వాల్, వాషింగ్టన్ సుందర్ ఇద్దరు కూడా ఆసియా కప్ టోర్నీలో స్టాండ్ బై ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. వీళ్లు దుబాయ్?కు వెళ్లనున్నారు. ఇక దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్‌తో సెప్టెంబర్ 4న జరగనున్న సెమీఫైనల్లో ఠాకూర్ వెస్ట్ జోన్‌కు నాయకత్వం వహించనున్నాడ్ను.మరోవైపు రోహిత్ శర్మ ఇప్పటికే టీ20, టెస్టు ఫార్మాట్లకు గుడ్ బై చెప్పడంతో వన్డేల్లోనే ఆడనున్నాడు. ఈ క్రమంలో భారత్ ఆక్టోబర్ లో ఆసీస్ పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో ఆతిథ్య ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్?లో రోహిత్ శర్మ బరిలోకి దిగే అవకాశం ఉంది.ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టు : సూర్య కుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్ పటేల్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రానా, రింకూ సింగ్

# భారత క్రికెట్‌కు రూ. 7 వేల కోట్ల నష్టం!

## ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుతో నష్టాలబాట

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లుతో భారత క్రికెట్‌కు భారీ నష్టం వాటిల్లనుంది. దాదాపు రూ. 7 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోనుంది. ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ బిల్లు కారణంగా ఫాంటసీ స్పోర్ట్స్ సంస్థలు, ఆన్‌లైన్ మనీ-బేస్డ్ గేమ్ యాప్స్ పూర్తిగా తమ కార్యకలపాలను నిలిపేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల నుంచే భారత క్రికెట్‌కు భారీగా ప్రకటనలు వచ్చాయి. కానీ తాజా బిల్లు కారణంగా ఆ ఆదాయాన్ని పూర్తిగా కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బిల్లు కారణంగా బ్రాడ్‌కాస్టర్లు, స్ట్రీమింగ్ ఫ్లాట్‌ఫామ్స్ తీవ్రంగా దెబ్బతింటాయని అడ్వర్టైజింగ్ రంగం నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ బిల్లు కారణంగా ఈ రంగమే అతిపెద్ద సవాల్ ఎదుర్కొనుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ బిల్లు కారణంగా టీమిండియా జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11 బీసీసీఐతో ఉన్న రూ. 358 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఐపీఎల్‌కు స్పాన్సర్‌షిప్ చేస్తున్న మై 11 సర్కిల్‌తో కుదిరిన రూ. 625 కోట్ల ఒప్పందం కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి.



# విమెన్ పవర్‌ను పురుషులే గుర్తిస్తారు

## తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

సినీ ఇండస్ట్రీలో గ్లామర్ రోల్స్ నుంచి వైవిధ్యమైన పాత్రల వరకు తనదైన ముద్ర వేసుకున్న నటి తమన్నా భాటియా. ఇటీవల ఒక కార్యక్రమంలో ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. సాధారణంగా మహిళలు తమ శక్తిని తాము గుర్తించకపోవచ్చని, కానీ జీవితంలో ఉన్న అద్భుతమైన పురుషుడు దాన్ని ప్రతిబింబంగా చూపిస్తారని ఆమె భావన వ్యక్తం చేసింది. తన జీవితంలో అలాంటి వ్యక్తులు ఉన్నారని ఆమె చెప్పిన తీరు, స్పష్టంగా నటుడు విజయ్ వర్మ గురించి అని అభిమానులు భావిస్తున్నారు. విజయ్ వర్మ తన జీవితంలోకి వచ్చాక తమన్నా నిజంగానే ఆత్మవిశ్వాసంతో, ఆనందంగా కనిపించింది. అయితే తర్వాత వారి కెరీర్ ప్రెజర్ కారణంగా విభేదాలు వచ్చి విడిపోయారనే వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ జంట ఒకరిపై ఒకరు నెగెటివ్‌గా మాట్లాడకుండా, పరస్పర గౌరవంతో సంబంధాన్ని ముగించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. తమన్నా వ్యాఖ్యల్లో అర్థం చేసుకునే స్వభావం ఇప్పుడు మహిళలకు ఒక ప్రేరణ గా మారుతోంది. సాధారణంగా బ్రేకప్‌ల తర్వాత, మీడియా ఎదుట ఏ జంట అయిన అగౌరవంగా మాట్లాడతారు.. కానీ తమన్నా తన భావాలను చెప్పిన తీరు మెచ్చుకోదగినయి. మొత్తానికి, ఈ వ్యాఖ్యలు తమన్నా వ్యక్తిత్వాన్ని మాత్రమే కాకుండా, ఆమె లోని మ్యాచ్యూరిటీ- ని కూడా హైలైట్ చేశాయి.



# శ్రీదేవి చాల్‌బాజ్ రీమేక్‌పై వార్తలు

## జాన్వీ కపూర్‌తో తీసే ఆలోచనలు

శ్రీదేవి, రజనీకాంత్, సన్నీదేవోల్ నటించిన హిట్ సినిమా 'చాల్‌బాజ్'. 1989లో వచ్చిన ఈ చిత్రం నటన పరంగా శ్రీదేవి కెరీర్‌లోనే బెస్ట్ సినిమాల లిస్ట్‌లో ముందు వరుసలో ఉంటుంది. పంకజ్ పరాశర్ దర్శకత్వంలో వచ్చిన ఈ మూవీ రీమేక్ ఇప్పటికే ఎన్నోసార్లు బాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. తాజాగా మరోసారి ఇది హాట్‌టాపిక్‌గా మారింది. బాలీవుడ్‌లో ఓ బడా నిర్మాత జాన్వీకపూర్‌తో ఈ సినిమా తీయనున్నట్లు- వార్తలు వస్తున్నాయి. తన తల్లి శ్రీదేవికి సంబంధించిన విషయాలే కాదు.. ఆమె నటించిన ప్రతి చిత్రం తనకు ఓ ఎమోషన్ అని జాన్వీకపూర్ ఎప్పుడూ చెబుతుంటారు. సందర్భం వచ్చినప్పుడల్లా ఆమెతో అనుబంధాన్ని పంచుకుంటుంటారు. అందుకే 'చాల్‌బాజ్'లో శ్రీదేవి పాత్రను పోషించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు- తెలుస్తోంది. జాన్వీకి ఇష్టమైన శ్రీదేవి సినిమాల్లో 'చాల్‌బాజ్' కూడా ఒకటని చాలెంజ్‌గా తీసుకొని ఈ పాత్ర కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్లు- బాలీవుడ్ మీడియా పేర్కొంది. ఈ రీమేక్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దీనికి దర్శకుడు ఎవరు అనే విషయాన్ని కూడా త్వరలోనే వెల్లడించనున్నారట. గతంలో ఈ సినిమాను 'చాల్‌బాజ్ ఇన్ లండన్' పేరుతో రీమేక్ చేయాలని భావించారు. శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు- పోస్టర్లు కూడా విడుదల చేశారు. అయితే ఈ ప్రాజెక్ట్ కొన్ని కారణాల వల్ల మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పుడు జాన్వీ నటించనున్నట్లు- వార్తలు రావడంతో మరోసారి ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. 'చాల్‌బాజ్'లో శ్రీదేవి ద్విపాత్రాభినయంలో కనిపించి ఆకట్టుకున్నారు. ఇప్పుడు జాన్వీ కూడా అలానే కనిపిస్తారా లేదంటే రీమేక్ కథలో మార్పులు చేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఈ బ్యూటీ- వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీ-వలే 'పరమ్ సుందరి'తో పలకరించారు. త్వరలోనే 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు అక్టోబర్ 2న ఈ చిత్రం విడుదల కానుంది. దీనితో పాటు- తెలుగులో 'పెద్ది'లో నటిస్తున్నారు.



# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో డ్రాగన్

## హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ ఫిక్స్

జూనియర్ ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న డ్రాగన్ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం స్పీడ్ గా జరుపుకుంటోంది. అయితే ఇందులో ఎవరు హీరోయిన్ అనే ప్రశ్న అందరిలోనూ ఉంది. ఈ మధ్య ఓ పేరు బాగా వినిపిస్తోంది. కానీ ఆమెనే తీసుకుంటున్నారా లేదా అనేది ఒక సస్పెన్స్. దానికి నిర్మాత క్లారిటీ- ఇచ్చేశాడు. ప్రస్తుతం తమిళ హీరో శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్ గా వస్తున్న మూవీ మదరాసి. సెప్టెంబర్ 5న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ఈవెంట్ ను తాజాగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఇందులో ప్రొడ్యూసర్ ఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ రుక్మిణి వసంత్ హీరోయిన్ అంటే ఆమె గురించి తాను ఎంక్వయిరీ చేసినట్టు- తెలిపాడు. ఆమె గురించి తనకు షాకింగ్ విషయాలు తెలిశాయన్నాడు. రుక్మిణి వసంత్ ఇప్పుడు మామూలు హీరోయిన్ కాదు. ఆమె చేతిలో వరుసగా పెద్ద సినిమాలే ఉన్నాయి. కాంతార-2 సినిమాలో ఆమెనే హీరోయిన్ గా తీసుకున్నారు. ఆ తర్వాత టాక్సిక్ లో కనిపించబోతోంది. అలాగే ఎన్టీఆర్ సినిమాలోన ఆమెనే హీరోయిన్ గా చేస్తోంది. ఈ మూవీ తర్వాత ఫుల్ బిజీగా గడపబోతోంది అంటూ తెలిపాడు. దీన్ని బట్టి ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాలో కచ్చితంగా రుక్మిణి వసంత్ ను ఫిక్స్ చేశారని తేలిపోయింది. ఆమె పేరు చాలా కాలంగా వినిపిస్తోంది. కానీ మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు నిర్మాత స్వయంగా చెప్పడంతో అసలు విషయం బయటకు వచ్చేసింది. దీనిపై త్వరలోనే అఫీషియల్ ప్రకటన కూడా రాబోతోందంట. రుక్మిణి వసంత్ ప్రస్తుతం సౌత్ లో పెద్ద సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది. ఆమె ఎన్టీఆర్ సరసన సూపర్ గా సెట్ అవుతుందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685